Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 251 మేడ్చల్ మల్కాజ్‌గిరి 30 సెప్టెంబర్ 2023 శనివారం పేజీలు : 4

### కర్ణాటక బంద్ ఎఫెక్ట్.. 44 విమానాలు రద్దు..

బెంగళూరు: తమిళనాడుకు కావేరీ జలాలు తరలించడాన్ని వ్యతిరేకిస్తూ కర్ణాటకలో చేపట్టిన బంద్ ప్రభావం ఆ రాష్ట్రంలో జనజీవనాన్ని స్తంభింపజేసింది. ఇవాళ బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో 44 విమానాలు క్యాన్సల్ అయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కన్నడ ఒక్కట అనే సంస్థ బంద్ కు పిలుపునివ్వగా.. చాలా మంది ప్రయాణికులు తమ ప్రయాణాలు వాయిదా వేసుకున్నారు.

**ఎయిర్ పోర్టులో ఉద్రిక్తత..** కర్ణాటక బంద్ లో భాగంగా బెంగళూరు ఎయిర్ పోర్ట్ లోకి కొందరు కన్నడ అనుకూల కార్యకర్తలు చొచ్చుకువచ్చారు. నీటి తరలింపునకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చొచ్చుకువచ్చారు. అక్కడే ఉన్న పోలీసులు అయిదుగురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కి తరలించారు.

# కేసీఆర్ హయాంలో రైతులకు మంచి రోజులు

## కృష్ణా జలాలను ఒడిసిపట్టి పాలమూరు బీడు భూములకు మళ్లించాం: మంత్రి కేటీఆర్



వనపర్తి: ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రైతులకు మంచి రోజులు వచ్చాయని మంత్రి కేటీఆర్ అన్నారు. రైతులకు పెట్టుబడి ఇచ్చే ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని చెప్పారు. రైతుబీమా, రైతుబంధుతో వ్యవసాయదారులకు భరోసా కల్పించారని తెలిపారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి వద్ద నిర్మించనున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి మంత్రి నిరంజన్ రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వరిధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉందన్నారు. రాష్ట్రంలో పండిన ధాన్యం కొనమంటే కేంద్రం కొర్రీలు పెడుతున్నదని విమర్శించారు. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే ప్రత్యామ్నాయ పంటలు వేయాలని సూచించారు. వేల టన్నుల నూనెను దేశంలోకి దిగుమతి చేసుకునే పరిస్థితి ప్రస్తుతం నెలకొన్నదని చెప్పారు. 20 లక్షల ఎకరాలకు ఆయిల్‌పామ్ సాగు తీసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదని వెల్లడించారు. తద్వారా రాష్ట్రం నుంచి దేశవ్యాప్తంగా నూనెలను ఎగుమతి చేయనున్నామని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు పెద్దఎత్తున సబ్సిడీ అందిస్తున్నామన్నారు. ఆయిల్‌పామ్ ద్వారా నెలకు ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆదాయం సమకూరుతుందని చెప్పారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలతో పంటల సాగులో వెళకువలు తెలుసుకోవాలని సూచించారు. ఊరూరికి ధాన్యం కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. పాలమూరు రైతన్నలు అద్భుతాలు సృష్టిస్తున్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. పాలమూరు జిల్లాలో నాడు మైగ్రేషన్.. ఇవాళ ఇరిగేషన్ అని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో జిల్లా ముఖచిత్రం మారనుందని చెప్పారు. కృష్ణా జలాలు ఒడిసిపట్టి పాలమూరు బీడు భూములకు మళ్లించామన్నారు. మళ్లీ గెలిచేది బీఆర్ఎసేనని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు.

**పంటల మార్పిడికి శ్రీకారం చుట్టిన సీఎం కేసీఆర్: మంత్రి నిరంజన్ రెడ్డి –** సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని బలోపేతం చేశారని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పంటల మార్పిడికి శ్రీకారం చుట్టారని తెలిపారు. దేశంలో 22 వేల మిలియన్ టన్నుల నూనె అవసరమన్నారు. అందులో 15 వేల మిలియన్ టన్నుల నూనెను దిగుమతి చేసకుంటున్నామని వెల్లడించారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఎంతో మేలు జరుగుతున్నదని పేర్కొన్నారు. లక్షా 25 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతున్నదని చెప్పారు. ఒక్క వనపర్తి జిల్లాలో 5 వేల ఎకరాల్లో పంట సాగవుతున్నదని వెల్లడించారు.

**వరి మాత్రమే సరిపోదు.. ఆయిల్‌పామ్ పండించాలి:** వ్యవసాయంలో తెలంగాణ దూసుకుపోతోందని తెలంగాణ మంత్రి కేటీఆర్ అన్నారు. వనపర్తి జిల్లా సంకిరెడ్డిపల్లిలో ఆయిల్‌పామ్ పరిశ్రమకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. "లక్షల టన్నుల వంట నూనె దిగుమతి చేసుకుంటున్నాం. రైతులు వరి మాత్రమే పండిస్తే సరిపోదు.. ఆయిల్‌పామ్ పండించాలని ప్రోత్సహిస్తున్నాం. 20లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. మంత్రి నిరజన్ రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆయిల్ పామ్‌ను సాగు చేస్తున్నారు. ఆయిల్ పామ్‌ను సాగు చేస్తే ప్రభుత్వం రాయితీలు ఇస్తుంది" అని కేటీఆర్ తెలిపారు.



### తెలంగాణ సీఎస్ అత్యవసర భేటీ.. కారణమేంటంటే.?

హైదరాబాద్: తెలంగాణ సీఎస్ శాంతికుమారి ఈరోజు అత్యవసరంగా కీలక అధికారుతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. కేంద్ర ఎన్నికల అధికారులు హైదరాబాద్ పర్యటనకు వస్తున్న సందర్భంగా సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. వచ్చేనెల మూడో తేదీ నుంచి సీఈసీ టీం నగరంలోనే ఉంటుందని తెలిపింది. కేంద్ర ఎన్నికల అధికారులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో పాటు సీనియర్ అధికారులు అందుబాటులో ఉండాలని సూచించింది.రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున వాటిపై అవగాహనా కలిగి ఉండాలని నిర్దేశించారు. పోలింగ్ కేంద్రలల్లో కనీస సౌకర్యాలు అందించేలా చూడాలని సీఎస్ శాంతికుమారి ఆదేశించారు.




గ్యారెంటీ లేని కాంగ్రెస్.. గ్యారెంటీ కార్డు ఇస్తానంటోందని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ఆక్షేపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరుగురు ముఖ్యమంత్రులు మారతారని.. మతకల్లోలాలు వస్తాయని విమర్శించారు. మంత్రులతో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన హరీశ్ రావు.. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

### త్వరలో సీఎం కేసీఆర్ శుభవార్త చెబుతారన్న మంత్రి హరీష్‌రావు.. ఇంతకీ ఏంటది?

యాదాద్రి: కాంగ్రెస్, బీజేపీ దిమ్మ తిరిగేలా బీఆర్ఎస్ మానిఫెస్టో ఉంటుందని.. త్వరలో సీఎం కేసీఆర్ ఆ శుభవార్త చెబుతారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. నాడు నేను రాను బిడ్డో సర్కారు దవాఖాన అంటే, నేడు నేను సర్కారు దవాఖానకు పోతా అంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి 30, 40 నియోజక వర్గాల్లో పోటీ చేసేందుకు సభ్యులు లేరన్నారు. ఇక్కడి నాయకుడు ఒకరు 24 గంటల కరెంట్ రావడం లేదు అంటున్నారని.. అందులో వేలుపెట్టి చూడు కరెంట్ వస్తుందా లేదా తెలుస్తుందంటూ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఉచిత కరెంట్ అని ఉత్త కరెంట్ చేశారన్నారు. కాంగ్రెస్ నాయకులు కరెంట్ గురించి మాట్లాడితే సూర్యుడి మీద ఉమ్మి వేసినట్లే అని అన్నారు. ఓట్ల కోసం ఆపద మొక్కులు కాంగ్రెస్ వి అంటూ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు చేశారు.

# హస్తం నీడకు మోత్కుపల్లి!

## డీకే శివకుమార్‌తో భేటీ - త్వరలోనే పార్టీ మార్పు?




నల్గొండ: జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. బీఆర్ఎస్ పార్టీ కీలక నేత మోత్కుపల్లి నర్సింహులు గత కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీంతో ఆయన పార్టీకి రాజీనామా చేసి త్వరలో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తన రాజకీయ భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీనే సరైన వేదిక అని మోత్కుపల్లి భావిస్తోన్నట్లు తెలుస్తోంది.

బెంగుళూరు కేంద్రంగా రాజకీయ మంతనాలు జరుపుతున్నారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో మోత్కుపల్లి నర్సింహులు శుక్రవారం భేటీ అయ్యారు. కాంగ్రెస్ పార్టీలో చేరికపై ప్రాధాన్యం సంతరించుకుంది. అక్టోబర్ మొదటి వారంలో కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలు ఉన్నాయి. తుంగతుర్తి నియోజకవర్గం నుంచి బరిలోకి దిగాలనే ఆలోచనలో మోత్కుపల్లి ఉన్నట్లు సమాచారం. ఇటీవల కొంతమంది కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు కూడా తనను పార్టీలోకి ఆహ్వానించినట్లు విశ్వాసనీయ సమాచారం. దీంతో ఆయన త్వరలో కాంగ్రెస్ గూటికి చేరే అవకాశాలు కనిపిస్తోన్నాయి.

చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఎన్టీఆర్ ఘాట్‌లో నిరహార దీక్ష కూడా చేశారు. ఆ సందర్భంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తనకు తమ్ముడు లాంటి వారని చెప్పిన విషయం తెలిసిందే. కాగా.. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు కూడా మోత్కుపల్లి దూరంగా ఉంటు వస్తున్నారు. పలుమార్లు సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ అడిగిన.. ప్రగతి భవన్ నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. పార్టీలో చేరిన సమయంలో సీఎం కేసీఆర్ కీలక పదవీ ఇస్తారని హామీ ఇచ్చినట్లు సమాచారం. పార్టీలో చేరిన కొత్తలో యాదగిరి నర్సన్న ఆలయానికి కేసీఆర్ వచ్చినప్పుడు ఆయన వెంట మోత్కుపల్లి తిరిగారు. ఆ తర్వాత కూడా కొన్ని కార్యక్రమాల్లో సీఎం కేసీఆర్ వెన్నంటి నడిచారు. ఏమయిందో కాని గత కొంతకాలంగా కేసీఆర్ మోత్కుపల్లి నర్సింహులును దూరంగా పెడుతూ వస్తోన్నారు. దీంతో మోత్కుపల్లి బీఆర్ఎస్ అధిష్ఠానం, సీఎం కేసీఆర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారం రోజుల క్రితం ఘాటైన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే.

# సంపాదకీయం

## డ్రాగన్ దేశంలో ఆర్థిక మాంద్యం.. అమెరికాకు దగ్గర కాక తప్పదా?

ప్రపంచాధిపత్యం కోసం అమెరికాతో పోటీ పడుతూ ఇప్పటికే చాలా అంశాల్లో ఆ దేశానికి దరిదాపుల్లోకి వచ్చేసింది.. చైనా. ఓవైపు సైనికంగా.. ఇంకోవైపు ఆర్థికంగా ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదగడానికి ఆ దేశం ఉరకలేస్తోంది. అయితే ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు ఆ దేశం ఆర్థిక మాంద్యం దిశగా పయనిస్తుందనే వార్తలు కల్లోలానికి కారణమవుతున్నాయి. ఇప్పటికే రష్యా %--%ఉక్రెయిన్ యుద్ధం ప్రభావంతో చాలా దేశాలు మాంద్యం బారినపడ్డాయి. ఇప్పుడు ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన చైనా మాంద్యం బారినపడితే దీని ప్రభావం ప్రపంచమంతటా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే అందరిలో ఆందోళనకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో చైనా ఇకపై తన వైఖరిని మార్చుకోనుందా? అంటే అవునని అంటున్నారు. ఎందుకంటే ఇప్పటికే చైనా ఆర్థిక వ్యవస్థ కోలుకోలేనంతగా దెబ్బతిందని అంటున్నారు. 2021లో కోవిడ్ వైరస్ ఆ దేశంలోనే వెలుగుచూసింది. 2021తోపాటు 2022 వరకు చైనా కోవిడ్ కల్లోలంతో బెంబేలెత్తింది. జీరో కోవిడ్ లక్ష్యంగా కఠిన లాక్ డౌన్లు విధించింది. దీంతో పరిశ్రమలు నిలిచిపోయాయి. ఆర్థిక కార్యకలాపాలు స్తంభించాయి. కోవిడ్ తెచ్చిన కల్లోలం చాలదన్నట్టు వన్ బెల్ట్ వన్ రోడ్ పేరుతో ప్రపంచ దేశాలను రోడ్డు, రైలు మార్గాలతో చైనాకు కలుపుకుని తన వస్తువులను ప్రపంచవ్యాప్తంగా అమ్ముకోవాలని చైనా ఆశించింది. అయితే వివిధ కారణాలతో ఈ ప్రాజెక్టు మూడు అడుగులు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్నట్టు సాగుతోంది. ఈ ప్రాజెక్టుకు చైనా కోట్లాది డాలర్ల వ్యయం చేస్తోంది. ఇందుకు వివిధ దేశాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టింది. మరోవైపు చైనా ప్రాపర్టీ రంగం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయింది. ఆ దేశంలోనే అతిపెద్ద రియల్టీ సంస్థలు దివాళా దిశగా పయనిస్తున్నాయి. ఆ దేశంలో 143 కోట్ల మంది ప్రజలు ఉండగా 300 కోట్ల మందికి సరిపోయేలా ఇళ్లు నిర్మించారు. దీంతో ఇప్పుడు ఆ ఇళ్లన్నీ అమ్ముడుపోక ఘోస్ట్ సిటీలను తలపిస్తున్నాయని అంటున్నారు. ఇలా కోవిడ్ ప్రభావం, వన్ బెల్ట్ - వన్ రోడ్, ప్రాపర్టీ రంగం పడకేయడం వంటి కారణాలతో చైనా ఆర్థిక వ్యవస్థ పతనమవుతోందని అంటున్నారు. దీంతో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని తెలుస్తోంది. దేశంలో నిరుద్యోగం తారాస్థాయికి చేరుకున్నదని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. జూలై 2023 నాటి గణాంకాల ప్రకారం.. 16 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసు కలిగినవారిలో 21.3 శాతం మంది యువత నిరుద్యోగులుగా ఉన్నారు. అంటే నిరుద్యోగిత రేటు 21 శాతం కంటే ఎక్కువగా ఉంది. మరోవైపు చైనాలో నిపుణులైన శ్రామిక శక్తి కొరత కూడా తలెత్తిందని తెలుస్తోంది. చైనా ప్రభుత్వం జనాభాను తగ్గించడానికి సింగిల్ చైల్డ్ పాలసీ విధానం అనుసరించడంతో ఆ దేశానికి చాలా నష్టం వాటిల్లింది. నిపుణులైన మానవ వనరులు లేక దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి పడిపోయింది. జీడీపీతో పోలిస్తే చైనా అప్పులు కూడా భారీగానే ఉన్నాయని అంటున్నారు. చైనాలో నెలకొన్న ఆర్థిక మాంద్యం ప్రభావం అది దాని మిత్ర దేశాలపై కూడా పడుతోంది. ఈ నేపథ్యంలో చైనా విభేదాలను పక్కనపెట్టి అమెరికాకు దగ్గరవుతోందని తెలుస్తోంది. ఇందులో భాగంగా అమెరికా, చైనాల దౌత్యవేత్తలు పరస్పరం కలుసుకుంటున్నారు. చైనా ఆర్థిక సంక్షోభంలో మునిగిపోతే యావత్ ప్రపంచంపై ప్రభావం పడుతుందన్న వాస్తవం అమెరికాకు కూడా తెలుసు. ఈ నేపథ్యంలోనే అమెరికా బెట్టు చేయకుండా చైనాతో చేతులు కలుపుతోందని అంటున్నారు. చైనాలో మాంద్యం ఏర్పడితే ప్రపంచవ్యాప్తంగా డిమాండ్, సరఫరా గొలుసు (డిమాండ్, సప్లై చెయిన్) ప్రభావితమవుతుందని పేర్కొంటున్నారు. అయితే చైనా, అమెరికాల మధ్య తాజా సన్నిహిత సంబంధాలు సానుకూల ఫలితాలను ఇస్తాయో లేదో వేచిచూడాల్సిందే.

# సుందరంగా మారేదెన్నడో?




కరీంనగర్ : కరీంనగర్ ఆకర్షణీయ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కూడళ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. స్మార్ట్‌సిటీలో భాగంగా రహదారులు, పార్కులు, మురుగునీటి కాల్వలు నిర్మిస్తుండగా అధ్వానంగా మారిన చౌరస్తాలను అదనపు హంగులు జోడించి నిర్మించేందుకు ప్రణాళికలు చేసి పనులు ప్రారంభించారు. ఇప్పటికే కమాన్ చౌరస్తా, శ్రీపాదరావు కూడలి, నాకా చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, పాత ఎంప్లాయ్‌మెంట్ కూడలి, ఆర్‌ఆండ్‌బీ కూడలి, అంబేడ్కర్ చౌరస్తా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెచ్చారు. పట్టణ ప్రగతి, స్మార్ట్‌సిటీలో మరిన్ని కూడళ్లను తీసుకొని తీర్చిదిద్దుతున్నారు.

**ఆహ్లాదకరంగా.. ఆకట్టుకునేలా..**

గతంలో విశాలమైన కూడళ్లు నిర్మించగా ఆ ప్రాంతంలో ఎలాంటి ట్రాఫిక్ ఆంక్షలు ఉండేవి కావు. వెడల్పుగా ఉండటంతో వాహనాలు ఆగకుండా నెమ్మదిగా వెళ్లే విధంగా అప్పటి అవసరాలకు తగ్గట్లుగా నిర్మించారు. వాహనాల సంఖ్య పెరగడం, వేగంగా రాకపోకలు సాగిస్తుండటం, పాదచారులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు ఎదురు కావడంతో ఆ విధానానికి స్వస్తి పలికారు. ఇప్పుడున్న కూడళ్లను కుదించి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసేలా ప్రణాళికలు చేశారు. ఆయా చౌరస్తాలలో అధునాతన డిజైన్లతో గ్రీనరీ, వాటర్‌ఫౌంటెయిన్, లైటింగ్స్, విభిన్న ఆకృతులు ఉండేలా మారుస్తున్నారు. శ్రీపాద కూడలిని ముట్టుకోకుండా, నాకాచౌరస్తా, ఆర్‌ఆండ్‌బీ జంక్షన్లకు మరింత అందాలు మెరుగు పర్చాలని భావిస్తున్నారు.

**ఆరు నెలలుగా నత్తనడకన**

నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం, ప్రజలందరికీ అడ్డాగా ఉండే తెలంగాణ, ఇందిరాచౌక్ ప్రాంతంలోని కూడలి సుందరీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆరు నెలల కిందట ప్రారంభించగా మూడు నెలలుగా ఎలాంటి పనులు చేయకుండా తవ్వి పెట్టారు. ఇందులోని ఎర్రమట్టి కూడా ఎక్కడ పడితే అక్కడికీ తరలించగా ఇప్పటికీ లెక్క తేల్చలేదు. బిల్లు రికార్డు చేసే సమయంలో ఆ మొత్తాన్ని మినహాయింపు ఇస్తామని చెబుతుండగా అదీ సాధ్యమయ్యే పనేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓల్డ్ పవర్ హౌజ్ కూడలిని గత నెల 19న ప్రారంభించడం, ఆ పనులు శరవేగంగా సాగుతుండటంతో గత్యంతరం లేక అప్పటి నుంచి వన్‌టౌన్, ఇందిరాచౌక్ కూడలిలో పనుల పురోగతి కొంతమేర కనిపిస్తోంది.

**నెలాఖరులోగా పూర్తి చేస్తారా?**

ఈనెలాఖరులోగా 13 జంక్షన్లను పూర్తి చేసేలా కార్యాచరణ తీసుకున్నట్లు ప్రకటించగా ఇప్పటికీ కొన్ని చోట్ల పనులే ప్రారంభం కాలేదు. మరో పది రోజులైతే ప్రకటించిన గడువు కూడా ముగియనుంది. ఆలోగా కనీసం మూడు కూడళ్లు కూడా పూర్తి చేసేలా కనిపించడం లేదు. మారుతీనగర్-ఓల్డ్ పవర్‌హౌజ్ జంక్షన్‌తో పాటు మరో మూడు కూడళ్లకు సంబంధించి అభివృద్ధి పనులు రూ.2.68 కోట్లతో నెల రోజుల కిందట ప్రారంభించారు. కాగా రామగుండం బైపాసు రోడ్డు, తీగల వంతెన, సదాశివపల్లి ప్రధాన రహదారి కూడలి నిర్మించేందుకు మార్కింగ్ ఇవ్వాల్సి ఉంది. ఒకచోట విద్యుత్తు టవర్ అడ్డుగా ఉండటంతో దానిని తొలగించేందుకు సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. కనీసం మొదటగా ప్రారంభించిన చౌరస్తాల పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన అవసరముంది.

**త్వరితగతిన పూర్తి**జంక్షన్ల అభివృద్ధి పనుల్లో వేగం అందుకుంది. వీటిని త్వరితగతిన పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. కొన్ని చోట్ల ఇబ్బందులు రాగా పరిష్కారానికి చర్యలు చేపట్టాం.
నాగమల్లేశ్వరరావు, ఎస్ఈ, నగరపాలిక

# సీలింగు భూమి అన్యాక్రాంతం



మల్యాల : ప్రభుత్వం 40 ఏళ్ల కిందట తమకు అందజేసిన సీలింగు భూములు అన్యాక్రాంతమైనట్లు మల్యాల మండలం ఓబులాపూర్ గ్రామానికి చెందిన 16 మంది దళిత సామాజిక వర్గానికి చెందిన లబ్ధిదారులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఓబులాపూర్ గ్రామశివారులోని వీరభద్రస్వామి గుడి సమీపంలో 1983లో అప్పటి ప్రభుత్వం ఒక్కొక్కరికి 11 గుంటల చొప్పున మొత్తం 4.10 ఎకరాలు పంపిణీ చేసి ప్రొసీడింగ్ అందించినట్లు వివరించారు. కొంతకాలం వర్షాధారమైన పంటలు సాగు చేసుకున్నామని తర్వాత నీటి వసతి లేక బీడుగా వదిలేయడంతో ఓ మాజీ ప్రజాప్రతినిధి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. 1971లో సీలింగు రూపొందించగా ప్రభుత్వం నిర్ణీత ఎకరాల కంటే అధికంగా ఉన్న భూస్వాముల భూములను స్వాధీనం చేసుకుని నిరుపేద దళితులకు పంపిణీ చేసింది. కొందరికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ అసైన్డు భూములను కూడా అప్పగించింది. పలు గ్రామాల్లో అసైన్డు భూములను ధరణిలో 'నిషేధిత' భూములుగా పేర్కొనడంతో లబ్ధిదారులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఓబులాపూర్ గ్రామా శివారులో ఎస్సీలకు అందజేసిన సీలింగు భూమిని రెవెన్యూ అధికారులు 2005 నుంచి ఓ మాజీ ప్రజాప్రతినిధి పేరున పహణీలో నమోదు చేయడంపై లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం అందజేసిన 4.10 ఎకరాల సీలింగు భూమికి సంబంధించి 16 మందికి కొత్త పాసుపుస్తకాలు జారీచేసి వారిపేర ఏటా రైతుబంధు అమలు చేస్తున్నా ఆ భూమి అన్యాక్రాంతంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇటీవల బాధిత లబ్ధిదారులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఆ భూమిని ఓ మాజీ ప్రజాప్రతినిధి తన సతీమణి పేర కొనుగోలు చేసి అందులో మామిడి తోట పెంచుతున్నట్లు తమ పరిశీలనలో తెలిందని జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేసినట్లు తహసీల్దార్ సుజాత వివరించారు.

**మా భూమి అప్పగించాలి** 1983లో ఓబులాపూర్ శివారులోని 4.10 ఎకరాల సీలింగు భూమిలో మా అమ్మ గంగు పేర ప్రభుత్వం ప్రొసీడింగ్ అందజేసింది. కొన్నేళ్లు మేము అందులో వివిధ వర్షాధార పంటలు సాగు చేసుకున్నాం. తర్వాత మా భూమిని ఓ మాజీ ప్రజాప్రతినిధి ఆక్రమించుకున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టరుకు, తహసీల్దారుకు మొరపెట్టుకున్నాం. ఆక్రమణకు గురైన మా భూమిని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి మాకు అప్పగించాలి.
చిట్యాల మురళి, ఓబులాపూర్, మల్యాల మండలం

**న్యాయం చేయాలి**

అమ్మ రాజవ్వ 1992లో అంతర్గాం వద్ద ఆర్టీసీ బస్సు బావిలో పడ్డ సంఘటనలో మృతి చెందింది. ఉపాధి రీత్యా నేను గల్ఫ్‌లో ఉన్నప్పుడు నాన్న భూమయ్య ఏడాది క్రితం చనిపోయారు. నాన్న పేరగల 11 గుంటల సీలింగు భూమిని నాపేర అమలు చేసి పాసుపుస్తకం జారీ చేయాలి. నిరుపేద కుటుంబానికి చెందిన మాకు జిల్లా కలెక్టరు న్యాయం చేయాలి. సీలింగు భూముల ఆక్రమణను తొలగించి మాకు అప్పగిస్తే మేము సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తాం. బడుగు శ్రీనివాస్, ఓబులాపూర్, మల్యాల

# ఆశలు రాలే... ఆదుకోవాలే..!

నల్గొండ : ఉమ్మడి జిల్లాలో కురిసిన అకాల వర్షానికి ఉద్యాన పంటలైన మామిడి, మిర్చి, పుచ్చకాయ, బత్తాయి, నిమ్మ, బొప్పాయితో పాటూ వరి పంట ఐదు వేల ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తెలిసింది. అధికారులు మాత్రం సుమారు వేయి ఎకరాల్లోనే పంటలకు పంట నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశారు. అత్యధికంగా నాంపల్లి, మర్రిగూడ, గుర్రంపోడు, మునుగోడు, మోత్కూరు, మోతే మండలాల్లో పంట నష్టం వాటిల్లింది. వాటిల్లిన పంట నష్టం అంతా 30 శాతం లోపే ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు. అత్యధికంగా నల్గొండ జిల్లాలోని నాంపల్లి, మర్రిగూడ మండలాల్లోనే సుమారు వేయి ఎకరాల వరకు పంటలు వడగళ్ల వానకు నష్టపోయాయి. పుచ్చకాయ పంట నాంపల్లి మండలంలో సుమారు 200 ఎకరాల్లో దెబ్బతింది. వీటికి అదనంగా నల్గొండ జిల్లాలోనే 341 మంది రైతులకు సంబంధించి 610 ఎకరాల్లో మామిడి, మిర్చి, పుచ్చకాయ పంటలు నష్టపోయినట్లు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తేల్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వడగళ్ల వానకు ఈనె దశలో ఉన్న పొలాలకు రెండు వేల ఎకరాలకు పైగా నష్టం వాటిల్లిందని తెలిసింది. యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో అధికారికంగా పంట నష్టం ఎంత అనేది అధికారులు తేల్చకపోయినా.. సుమారు 1000 ఎకరాల వరకు ఉద్యాన, వ్యవసాయ పంటలు నష్టపోయినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. కృష్ణపట్టి ప్రాంతాలైన మేళ్లచెరువు, చింతలపాలెం, దామరచర్ల మండలాలతో పాటూ మోతేలో మిర్చి పంటకు నష్టం వాటిల్లింది. ఈ దఫా మామిడి పూత బాగా ఉండటంతో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని రైతులు ఆశపడ్డారు. వారి ఆశలపై తాజాగా వడగళ్ల వాన నీళ్లు చల్లింది. చాలాచోట్ల ఈదురుగాలులకు తోడు వడగళ్లు పడటంతో పూత రాలింది. కొన్ని చోట్ల చిన్న చెట్లు నేలకూలాయి. ఈ పరిస్థితులతో బత్తాయి, బొప్పాయి, నిమ్మ పంటల దిగుబడులు సైతం తగ్గుతాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీమా ఏదీ? అతివృష్టి, అనావృష్టి సమయాల్లో రైతులకు అండగా ఉండాల్సిన బీమా పథకాలు ఆపత్కాలంలో వారికి అందడం లేదు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన గత నాలుగైదేళ్లుగా రాష్ట్రంలో అమలు చేయడం లేదు. దీనికి తోడూ రాష్ట్రంలోనూ రైతులు పంట నష్టపోతే వారికి వర్తించే పథకాలు ఒక్కటీ అందుబాటులో లేవు. దీంతో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతింటే ప్రభుత్వాల పరంగా వారికి ఎలాంటి అండ దొరకడం లేదు. దీంతో ఆరుగాలం కష్టించి పనిచేసిన వారు ఆర్థికంగా నష్టపోతున్నారు.

# నిధులున్నా ముందుకు సాగని పనులు

వేములవాడ : ఏటా వర్షాకాలంలో పడుతున్న కష్టాలు తొలగించేందుకు ప్రభుత్వం హైలెవల్ వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో వచ్చే వర్షాకాలంలోనూ ప్రజలకు రవాణా కష్టాలు తప్పేటట్లు లేవు. నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా పనులు అగ్రిమెంట్ దశలోనే ఉండటంతో వంతెనల నిర్మాణం ఇప్పట్లో జరిగేటట్లు కనిపించడం లేదు. వేములవాడ పట్టణానికి చుట్టు పక్కల నుంచి వచ్చే మూడు రహదారుల్లో కల్వర్టులు ఉన్నాయి. వరద పారి వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది. ఇక్కడ హైలెవల్ వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వేములవాడ శివారులోని మల్లారం రోడ్డులో వంతెనకు రూ.3 కోట్లు, వేములవాడ శివారు శాత్రాజుపల్లి గంజివాగు వద్ద వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు, మర్రిపల్లి శివారులోని వంతెన నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో మర్రిపల్లి వద్ద వంతెన నిర్మాణ పనులకు టెండర్లు పూర్తయి అగ్రిమెంట్ కావడంతో గత ఏడాది నవంబర్ 17న స్థానిక ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు భూమిపూజ చేశారు. పనులు మాత్రం నేటికీ ప్రారంభం కాలేదు. అప్రోచ్ రోడ్డు పనులు మొదలైనట్లు ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ మూడు కల్వర్టుల వద్ద వంతెనల నిర్మాణాలు పూర్తయితే పట్టణానికి వర్షాకాలంలోనూ రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటుంది.

**ఏటా కష్టాలే...** ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడ నుంచి చుట్టు పక్కల ప్రాంతాల రహదారుల్లో ఉన్న వాగులు, వంకలు ప్రతి వర్షాకాలంలో ఉద్ధృతంగా పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. భారీ వర్షాలు కురిస్తే వేములవాడ పట్టణం నుంచి కొండగట్టు, వేములవాడ నుంచి మల్లారం, హన్మాజీపేట వైపు, వేములవాడ నుంచి మర్రిపల్లి, కోరుట్ల వైపు వాహనాల రాకపోకలు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. అటువైపు నుంచి వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కల్వర్టులపై హైలెవల్ వంతెనలను నిర్మించి వాహనదారుల కష్టాలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు దశాబ్దాల కాలంగా ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు. అయినా వంతెనలు మాత్రం పూర్తి కావడం లేదు.

**ప్రతిపాదనల్లో మరో నాలుగు...**

సబ్ డివిజన్‌లో మరో నాలుగు హైలెవల్ వంతెనల నిర్మాణాలకు నిధుల మంజూరు కోసం రోడ్లు భవనాల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. వేములవాడ గ్రామీణ మండలంలోని హన్మాజీపేట నక్కవాగుపై హైలెవల్ వంతెనకు రూ.11 కోట్లు, కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి- నిజామాబాద్ మధ్య వంతెనకు రూ.18 కోట్లు, బావుసాయిపేట- వెంకట్రావుపేట మధ్య వంతెనకు రూ.14 కోట్లు, వట్టిమల్ల- నిమ్మపల్లి మధ్య వంతెనకు రూ.7 కోట్లు, కొండాపూర్- మర్రిమడ్ల మధ్య వంతెన నిర్మాణానికి రూ.9 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఇది జరిగి ఏళ్లు కావస్తున్నా నిధుల మంజూరుకు నోచుకోవడం లేదు. ఈ వంతెనలన్నింటికి నిధులు మంజూరై నిర్మాణాలు జరిగితే వేములవాడ, కోనరావుపేట మండలాల్లో వర్షాకాలంలోనూ రాకపోకలకు అంతరాయం ఉండదు. ప్రభుత్వం వెంటనే ఈ వంతెనల నిర్మాణాలన్నింటికీ నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**రెండు పనులు ఒప్పంద దశలో ఉన్నాయి**
**- సతీష్, ఏఈ, ఆర్‌అండ్‌బీ వేములవాడ**

మల్లారం రోడ్డులోని వంతెన, వేములవాడ శివారులోని శాత్రాజుపల్లి వద్ద వంతెనల నిర్మాణ పనులు అగ్రిమెంట్ దశలో ఉన్నాయి. మర్రిపల్లి వద్ద వంతెన నిర్మాణానికి అప్రోచ్ రోడ్డు పనులు మొదలయ్యాయి. ఈ మూడు వంతెనలు వర్షాకాలం లోపు దాదాపు పూర్తవుతాయి. మిగతా వంతెనలకు నిధులు మంజూరు కావాల్సి ఉంది.

# భవితలో.. అవస్థల రాత

నల్గొండ : వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి సేవలు అందించడం, అవసరం మేరకు శస్త్ర చికిత్సలు చేసి వారిని సాధారణ స్థితికి తీసుకొచ్చి విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణకు నిధులు రాక్ల దివ్యాంగ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్తు బిల్లులు చెల్లించక కరెంటు కట్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. భవనాల్లో సమస్యలు పరిష్కరించడం లేదు.

జిల్లాలో భవిత కేంద్రాల్లో జిల్లాలో 13 భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటిలో దివ్యాంగ విద్యార్థులు చదువుకుంటున్నారు. కేంద్రాల నిర్వహణకు నిధులు రాక అవస్థలు పడుతున్నారు. జిల్లా కేంద్రమైన నల్గొండ భవిత కేంద్రం భవనానికి విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడంతో సంబంధిత శాఖ అధికారులు రెండు నెలల క్రితం విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. కరెంటు లేక ఫ్యాన్లు పని చేయక ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నా.. విద్యుతు శాఖ అధికారులు కనికరించడం లేదని దివ్యాంగ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే కేంద్రంలో శౌచాలయాల్లో నల్లాలు ఏడాదిగా పని చేయడం లేదు. దీంతో దివ్యాంగులు అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పైపులు మరమ్మతుకు వచ్చి నీరు రాక మరుగుదొడ్లు దుర్వాసన వస్తున్నాయని వాపోతున్నారు. విద్యుత్తు కనెక్షన్ ఇప్పించి, శౌచాలయాలు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు. భవిత కేంద్రాల్లో అధికారులు సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**శిబిరాలు నిర్వహించినా ఫలితమేది**

నల్గొండలోని డైట్ కళాశాల ప్రాంగణంలో నవంబరు 19న సమగ్ర శిక్ష, విద్యా శాఖ ఆధ్వర్యంలో కృత్రిమ అవయవ నిర్మాణ సంస్థ సమక్షంలో దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. 234 మంది దివ్యాంగ విద్యార్థులకు పరికరాలు అవసరమని గుర్తించారు. ఓ సంస్థ సహకారంతో వీటిని అందిస్తామని అధికారులు ప్రకటించారు. అయినా నేటికీ అందలేదు. కాలు సైజుకు సరిపడా క్యాలిపర్ల కోసం కొలతలు తీసుకున్నారు. ఆలస్యంగా వస్తే కాలు పెరిగితే క్యాలిపర్ పట్టదని వెంటనే ఇస్తే ప్రయోజనం ఉంటుందని దివ్యాంగులు తెలిపారు. నిధులు వచ్చాయి..కేంద్రాలకు పంపుతాం: వీరయ్య, భవిత కేంద్రాల సమన్వయకర్త

# కళ తప్పిన కేఎంజీ పార్కు

వరంగల్ : వరంగల్ నగరంలోని కాకతీయ మ్యూజికల్ గార్డెన్ (కేఎంజీ) ఉత్తర తెలంగాణ ఉమ్మడి జిల్లాల ప్రజలకు సుపరిచితమే. కర్ణాటక రాష్ట్రం మైసూరు బృందావన్ గార్డెన్ మాదిరిగా 1996లో దీన్ని అభివృద్ధి పరిచారు. 15 ఏళ్ల పాటు సందర్శకులతో కిట కిటలాడింది. సాయంత్రం వేళల్లో మ్యూజికల్ ఫౌంటేన్ ప్రదర్శనలు అలరించాయి. హిందీ, తెలుగు సినిమా పాటలతో సందర్శకులను మంత్ర ముగ్దులను చేసింది. వాటర్ ఫౌంటెన్, బోటింగ్, డక్ పార్కు, రోజ్ గార్డెన్ తదితరాలు ప్రత్యేక ఆకర్షణగా ఉండేవి. పిల్లలు, పెద్దలను పార్కు ఎంతో అలరించేంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పార్కు పూర్తిగా కళ తప్పింది. మూడు ఏళ్లుగా పార్కును మూసేశారు. గత పది రోజుల క్రితం చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, హనుమకొండ



జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, కమిషనర్ రిజ్వాన్ బాషా, 'కుడా' ఛైర్మన్ సుందర్‌రాజ్ పార్కును సందర్శించారు. మ్యూజికల్ గార్డెన్‌కు పూర్వవైభవం తెవాలని అధికారులను ఆదేశించారు. మ్యూజికల్, వాటర్ ఫౌంటెన్ పునరుద్ధరణ, చిన్న చిన్న శుభకార్యాలు, ఫంక్షన్ల కోసం కన్వెన్షన్ హాల్, హెూటల్ తదితర పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) ద్వారా పునరుద్ధరించాలని చూస్తున్నారు.

నాలాతో ముంపు భయం

కాకతీయ మ్యూజికల్ గార్డెన్ గత 15 ఏళ్లుగా ముంపునకు గురవుతుంది. బొందివాగు, భద్రకాళి చెరువు నాలాల వరద నీరంతా నేరుగా పార్కులోకి వస్తోంది. పోతననగర్ నుంచి కేఎంజీ పార్కు మధ్యలో నుంచి కచ్చ నాలా ఉంది. విస్తీర్ణం తక్కువగా ఉంటుంది. గత జులైలో కురిసిన భారీ వర్షాలతో వారం రోజుల పాటు పార్కు వరద నీటిలోనే ఉంది. ప్రస్తుతం పిల్లల ఆట వస్తువులు, గ్రీనరీ, చిన్న చితక పనులు చేస్తున్నారు. నాలాకు శాశ్వత పరిష్కారం చూపాలని నగర ప్రజలు కోరుతున్నారు.

# అసంపూర్తిగా ఎస్టీ బాలుర గురుకులం

వరంగల్ : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రానికి జంట పట్టణమైన శివునిపల్లిలోని ఎస్టీ బాలుర వసతి గృహ భవన పనులు అర్ధాంతరంగా.. అసంపూర్తిగా గాలికొదిలేశారు. 16 ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయకపోవడంతో వృథాగా మారి.. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టీ బాలుర వసతి గృహాన్ని గురుకులంగా ఏర్పాటు చేయాలని సంకల్పించింది. వసతి గృహం వెనుక భాగంలో ఉన్న స్థలంలో రూ.25 లక్షలతో 8 గదులతో పనులు ప్రారంభించారు. పిల్లర్లు, బీములు, స్లాబ్ దర్వాజాలు, కిటికీలు, గోడలను పూర్తి చేశారు. ఇక అంతే సంగతులు గుత్తేదారు చేతులెత్తేశారు. భవనానికి గిలాబ్,(ప్లాస్టింగ్) విద్యుత్ కనెక్షన్, రంగులు, ఫ్లోరింగ్ వాటర్ పైపులు సానిటరీ, మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించాల్సి ఉంది. తిరిగి మళ్లీ ఇదే భవనానికి మరో రూ.25 లక్షలు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ టెండర్లు పిలవకపోవడంతో మంజూరైనా నిధులు వెనక్కి వెళ్లాయి. ఇప్పటికీ 16 ఏళ్లు అవుతున్న భవనం ఇంకా అసంపూర్తిగానే ఉంది. స్థానికులు కొందరు పశువుల కొట్టంగా వినియోగిస్తున్నారు. భవనం గదుల్లో పశువులను కట్టేస్తున్నారు. గడ్డి, పేడతో గదులు పూర్తిగా అపరిశుభ్రంగా మారాయి, లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం ప్రస్తుతం పశువుల కొట్టంగా మారి నిరుపయోగంగా ఉండడం పలువురిని బాధిస్తోంది. భవన పనులు పూర్తి చేస్తే బాలుర కోసం గురుకులం ప్రారంభించుకునే అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. మండల కేంద్రంలో ప్రస్తుతం సొంత భవనాలు లేక చాలా కార్యాలయాలను అద్దె భవనాల్లో నడుపుతున్నాయి. రిజిస్ట్రేషన్, కార్యాలయం, విద్యుత్, ఈఆర్‌వో, భూసేకరణ కార్యాలయం, అటవీ శాఖ, ఐసీడీఎస్ ప్రాజెక్టు, ఎక్సైజ్ కార్యాలయంతో పాటు తదితర ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్నాయి. ఈ భవనాన్ని పూర్తి చేస్తే కొన్ని కార్యాలయాలకు కేటాయించవచ్చాని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పనులు వెంటనే పూర్తి చేయాలి – తోట రమేష్.. శివునిపల్లి

శివునిపల్లి ఎస్టీ బాలుర గురుకులం ఏర్పాటు కోసం చేపట్టిన భవనం పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. దీనికి నిధులు కేటాయించి భవనం పూర్తి చేసి.. ప్రభుత్వ కార్యాలయాలకైనా కేటాయించాలి. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలి.


అధికారుల దృష్టికి తీసుకెళ్తా– తిరునగరి శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి శివునిపల్లి

శివునిపల్లి ఎస్సీ కాలనీలో నిర్మించిన ఎస్టీ బాలుర గురుకుల భవనం అసంపూర్తి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.. భవనం వినియోగంలోకి తేచ్చే విధంగా కృషి చేస్తాను.

# కాల గర్భంలో ప్రాచీన సంపద..!

వరంగల్ : ప్రాచీన కాలం నాటి చరిత్రను పట్టించుకోవడంలో పాలకులు, అధికారులు ఏమాత్రం చిత్త శుద్ధిని కనపరచడం లేదనడానికి గీసుకొండలోని ప్రాచీన కాలం నాటి నల్లరాతి గుట్టే ప్రధాన సాక్ష్యంగా నిలుస్తోంది. ఓరుగల్లు అనగానే మనకు కాకతీయ సామ్రాజ్య వైభవం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. వేల సంవత్సరాలకు పూర్వమే గీసుకొండ ప్రాంతంలో ఆదిమానవుడి కాలం నాటి ఎన్నో ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. గీసుకొండలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి గుట్ట పురాతనమైనది. సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. హైదరాబాద్ ఉస్మానియా యునివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసరుగా పని చేస్తున్న గీసుకొండకు చెందిన ముత్తినేని రాధాకృష్ణకు గుట్ట వద్ద వ్యవసాయ భూమి ఉండగా, ఆయనకు పురాతన కాలంనాటి ఎన్నో అవశేషాలు లభించాయి. రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు జరపగా ఆదిమానవుడి కాలం నుంచి కాకతీయుల వరకు ఎన్నో ఆధారాలు లభ్యమయ్యాయి. ఆదిమానవుడు ఉపయోగించిన గండ్ర గొడ్డళ్లు, శాతవాహన కాలం నాటి బోధిస్వతుని ప్రతిమ, టెర్రకోట బొమ్మలు, పూసలు, అనేక మట్టి పాత్రలు దొరికాయి. వాటిని జిల్లా పురావస్తు శాఖ కార్యాలయంలో భద్రపరిచారు. తవ్వకాలపై పార్లమెంటులో చర్చకు రావడం గమనార్హం. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పర్యాటక అభివృద్ధే శ్రీరామరక్ష..!



భద్రాచలం : భద్రాచలం పరిసరాలు ఆధ్యాత్మికంగాను, పర్యాటకంగాను భక్తులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. పలు సుందర ప్రాంతాలు ఇట్టే కట్టిపడేస్తున్నాయి. దైవ దర్శనాలు ఒక వైపు మనసుకు ప్రశాంతతను అందిస్తుండగా చూడచక్కని రమణీయ ప్రదేశాలు అంతులేని ఆనందాన్ని పంచుతున్నాయి. ఈ ప్రాంతంలో చేయాల్సిన అభివృద్ధి పనులే పర్యాటకానికి శ్రీరామ రక్ష. ప్రతిపాదనల్లో ఉన్న పనులన్నీ పూర్తయితే యాత్రికులకు ఇదో ఆనందధామంగా విరాజిల్లనుంది.

ఆధ్యాత్మికత ఆహ్లాదం..

భద్రాచలంలో రామయ్యను దర్శించుకుని గోదావరిలో బోట్ షికార్ చేస్తే ఆ ఆనందమే వేరు. ప్రభుత్వం ప్రకటించిన నిధులు వస్తే ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరియడం ఖాయంగా కనిపిస్తోంది. కేంద్ర ప్రభుత్వం దేశంలోని ఆరు రాష్ట్రాల్లో 11 ప్రాంతాలను కలుపుతూ రామాయణ వలయాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో భద్రాచలం పేరు ఉంది. దీనికి సంబంధించిన ప్రత్యేక రైలునూ ప్రారంభించారు. ఇది ఎప్పుడు వస్తుందో ఎప్పుడు వెళ్తుందో ప్రచారం చేస్తే భక్తులకు ఉపయుక్తంగా ఉంటుంది. గోదావరి కరకట్టను సుందరంగా తీర్చిదిద్దితే పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి.

ఒడిశా నుంచి భద్రాచలం మీదుగా బూర్గంపాడు మండలం పాండురంగాపురం వరకు కొత్త రైల్వే లైను పనులకు సర్వేలు చేపట్టారు. ఇది అందుబాటులోకి వస్తే భక్తుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. పాపికొండల యాత్ర ప్రస్తుతం ఆగినా గోదావరిపై ఈ ప్రయాణం చేస్తే జీవితాంతం గుర్తిండిపోయే మధురానుభూతులను మిగుల్చుతుంది. భద్రాచలం నుంచి 120 కి.మీ. దూరంలో ములుగు జిల్లా వాజేడు మండలంలో ఉన్న బొగత జలపాతం ప్రత్యేకతే వేరు. దీన్ని తెలంగాణ నయాగరాగానూ పలువురు అభివర్ణిస్తున్నారు.

సందర్శనీయం.. సంతోషకరం

దుమ్ముగూడెం మండలం పర్ణశాల దర్శనం ఎంతో పవిత్రం. సీతాదేవిని రావణాసురుడు అపహరించిన ప్రాంతమిది. సీతమ్మవారి నార చీరల చారలు ఇప్పటికీ కనిపిస్తాయి. రామాయణంలోని ముఖ్య ఘట్టాలకు వేదిక ఇది. భద్రాచలం నుంచి 35 కి.మీ దూరంలో ఉంది.

కాకతీయుల కాలంలో 600 సంవత్సరాల కిందట నిర్మించిన బూర్గంపాడు మండలం మోతెగడ్డ దివ్యక్షేత్రం ఎంతో పవిత్రమైనది. భద్రకాళీ సమేత వీరభద్రుడు కొలువైన ఈ క్షేత్రాన్ని శివరాత్రికి వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు.

సీతాదేవిని రావణుడు అపహరించుకుని తీసుకెళుతున్న సమయంలో జటాయు అనే పక్షి అడ్డుకుని భీకర పోరు చేస్తుంది. ఈ సమయంలో పక్షి రెక్క తెగిన ప్రాంతమే కాలక్రమంగా ఎటపాకగా మారందని ప్రతీతి. ఇది దర్శనీయ ప్రదేశంగా గుర్తింపు పొందింది.

వనవాసం సమయంలో ప్రయాణ బడిలికతో ఉన్న సీతమ్మవారు స్నానం చేసేందుకు నీళ్లు అవసరమయ్యాయి. ఇందుకు రాముడు బాణం వదిలిన ప్రాంతం నుంచి వేడి నీళ్లు బయటకు వస్తాయి. ఈ ప్రాంతమే ఉష్ణ గుండాల అని పౌరాణిక గాథ. భద్రాచలానికి 6 కి.మీ దూరంలో ఉంది.

# అబ్కారీ బండి.. అంతేనండి..!



ఖమ్మం : ఆబ్కారీశాఖ అధికారుల విధులు చాలావరకు బయటే ఉంటాయి. నాటుసారా, గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడం, నిందితులపై కేసులు పెట్టి జైలుకు పంపడం వంటి విధులే ఎక్కువ. ఇలాంటి శాఖకు చెందిన వాహనాలు కదల్లేని పరిస్థితి ఉంటే ఎలా.. ఇక అధికారులు ఏం పనిచేస్తున్నట్టు అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పరిస్థితి అచ్చం అలానే ఉంది. అన్నీ కిరాయి వాహనాలే. వీటికీ 21 నెలలుగా అద్దె నిధులు రావడం లేదు. మరి వాహనాలు ఎలా నడుస్తున్నాయి అంటే ఏదో అలా ఉన్నాయనే సమాధానం వస్తోంది. ఈప్రభావం శాఖ పనితీరునే ప్రశ్నించే దశకు చేరిందనే విమర్శలున్నాయి.

ఆబ్కారీ శాఖలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఉప కమిషనర్, సహాయ కమిషనర్.. ఖమ్మం జిల్లాలో 7 స్టేషన్లు, భద్రాద్రి జిల్లాలో 6 సర్కిల్ స్టేషన్లు ఉన్నాయి. ఉభయ జిల్లాల్లో రెండు టాస్క్‌ఫోర్స్ విభాగాలు, పర్యవేక్షించే ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలకు వాహనాలు ఉన్నాయి. ఓనర్ కం డ్రైవర్‌తో కూడిన పద్ధతిలో ఒక్కో వాహనానికి నెలకు రూ.33వేల అద్దెను ప్రభుత్వం చెల్లిస్తోంది. వీటి బకాయిలు 21 నెలలుగా రావడం లేదు. ఈ ప్రభావం శాఖ కార్యకలాపాలపై పడుతోంది. అద్దెలు రావడం లేదని వాహనదారులు లబోదిబోమంటుంటే.. వీరి పరిస్థితి గమనించిన అధికారులు వాహనాలను ఆశించిన రీతిలో వాడుకోలేక పోతున్నారు.

వాహనానికో కథ

మొత్తంగా పరిస్థితి ఇలా ఉంటే శాఖలో కొనసాగుతున్న అద్దె వాహనాల్లో ఒక్కో వాహనం కథ ఒక్కో రీతిలో ఉంది. మొత్తం 23 వాహనాల్లో సగం ఉద్యోగుల బంధువులు, దగ్గరి వారి పేర్లతో ఉన్నట్టు సమాచారం. కొన్నిచోట్ల వాహన బాధ్యులే పెట్టుబడి పెట్టి నడిపిస్తున్నట్టు సమాచారం. మరికొన్నిచోట్ల స్టేషన్ అధికారి డీజిల్ ఖర్చులు భరించి బిల్లులు వచ్చాక తిరిగి తీసుకునే ఒప్పందంలో బండ్లు నడుస్తున్నాయి. ఇలాంటి విషయాల్లో అంటీముట్టనట్టుగా ఉంటున్న అధికారులు వాహనాలకు పని చెప్పడం లేదు.

వాహనాల బకాయిలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. వాటికి, శాఖ పనితీరుకు ఎలాంటి సంబంధం లేదు. చాలావరకు వాహన యజమానులు డ్రైవర్లను నియమించుకొని కొనసాగిస్తున్నారు. రావాల్సిన మొత్తం ఆలస్యం అయితే ఎవరికైనా ఇబ్బందులు ఉంటాయి. ఇక్కడా అదే పరిస్థితి. కొంత ఆలస్యంగానైనా డబ్బులు వస్తాయని వారికీ తెలుసు. సకాలంలో బిల్లులు అందించేందుకు ప్రయత్నిస్తున్నాం. నాగేంద్రరెడ్డి, జిల్లా ఆబ్కారీ అధికారి, ఖమ్మం

గంజాయి కేసులే...ఉభయ జిల్లాల్లో అందిన సమాచారం మేరకు అక్రమ ముఠాలపై దాడి చేసి పట్టుకునే బాధ్యత రెండు టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలది. ఈ బృందాలు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కలియదిరగాలి. తనిఖీలకు బయలుదేరినప్పుడు అక్కడి మద్యం దుకాణాలు వంతులవారీగా డీజిల్ పోయించే బాధ్యత తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ బృందాలు మద్యం దుకాణాల వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టుకుంటే గంజాయి కేసులే అనే రీతిలో ఈ బృందాలు కొనసాగుతున్నాయని నమోదవుతున్న కేసుల తీరు స్పష్టం చేస్తోంది.

సంచార బృందాలదీ ఇదే తీరు

ఉభయ జిల్లాలకు రెండు సంచార తనిఖీ విభాగాలను ప్రభుత్వం ఏడాది క్రితం మంజూరు చేసింది. ఇందుకు మరో రెండు వాహనాలు కావాలి. ఉన్నవాటి పరిస్థితే అంతంతమాత్రం కావటంతో కొత్తగా మరో రెండింటిని చేర్చేందుకు అధికారులు ఆసక్తి చూపటం లేదనే వాదనలు వ్యక్తమ వుతున్నాయి. ఉన్నత స్థాయి నుంచి తగిన ఉత్తర్వులు వచ్చాక ప్రారంభిస్తామని ఇక్కడి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ఏడాది క్రితం మంజూరైన సంచార తనిఖీ వ్యవస్థ ఉభయ జిల్లాల్లో ఏర్పాటుకు నోచుకోలేదు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఎన్నికలు వస్తే రెండింతలు పని ఉంటుంది. అప్పుడు పరిస్థితి ఎలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

# ఉనికి చాటాలని ఉవ్విళ్లూరుతున్న భాజపా

ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉనికి చాటాలని భారతీయ జనతా పార్టీ ఉవ్విళ్లూరుతోంది. తాజాగా నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌ఛార్జిలను ప్రకటించింది. ఖమ్మం జిల్లా పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జితోపాటు పది శాసనసభ స్థానాలకు సమన్వయ బాధ్యులను నియమించింది.


ఏజెన్సీ నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి

వరంగల్‌కు చెందిన కలవాల త్రిలోకేశ్వర్‌ను ఖమ్మం జిల్లా భాజపా ఇన్‌ఛార్జిగా ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నియమించారు. పినపాక నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా అజ్మీరా కృష్ణవేణినాయక్, ఇల్లెందు– కటకం నర్సింగ్‌రావు, ఖమ్మం– మారేపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, పాలేరు– పెదగాని సోమయ్యగౌడ్, మధిర– జలగం రంజిత్, వైరా– కూసంపూడి రవీంద్ర, సత్తుపల్లి– కనగాల వెంకట్రామయ్య, కొత్తగూడెం– మేఘనాథ్, అశ్వారావుపేట– గాదె రాంబాబు, భద్రాచలం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా తాటి కృష్ణ నియమితులయ్యారు. పార్టీ శ్రేణులను శాసనసభ ఎన్నికలకు సన్నద్ధం చేసేలా కార్యాచరణ రూపొందించేందుకు ఇన్‌ఛార్జిలకు సమన్వయ బాధ్యతలను రాష్ట్ర నాయకత్వం అప్పగించింది. ఇతర రాష్ట్రాలకు చెందిన భాజపా ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనేతలు ఉభయ జిల్లాల్లోని పది నియోజకవర్గాల్లో ఇటీవల పర్యటించారు. కార్యకర్తలను కలిసి ఆశావహుల బలాబలాలపై ఆరా తీశారు. ఈసారి ప్రత్యేకంగా ఏజెన్సీ నియోజకవర్గాలపై భాజపా దృష్టి సారించింది. ఎస్టీ నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తోంది. ముఖ్యనేతల పర్యటనలతో శ్రేణుల్లో ఉత్సాహం కనిపిస్తున్నా క్షేత్రస్థాయిలో పార్టీకి ఆశించిన బలం లేకపోవడం కమలదళాన్ని కలవరపెడుతోంది.

# కాల్వలున్నా అందని నీరు

ఇబ్రహీంపట్నం : ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఎస్సారెస్పీ డి29 ప్రధాన కాల్వలో ఏర్పాటు చేసిన షట్టర్లను పై భాగంలోని గ్రామాల వారు తొలగించడంతో ఆయకట్టు పరిధిలోని చివరి గ్రామాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. కాల్వల్లో నీటిని వదిలినప్పుడు పైభాగంలో ఉన్న చెరువులు నిండి నీరంతా వృథాగా పోతుంది. కాల్వలు ఉన్నా నీరు అందకపోవడంతో చివరి రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది.

మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాల్లోని పలు గ్రామాలకు శ్రీరామసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాల్వలోని డి29 ద్వారా సాగునీటిని అందిస్తున్నారు. మెట్‌పల్లి మండలం సింగరావుపేట, రేగుంట, వెంపేట, ఇబ్రహీంపట్నం మండలం గోధూర్‌తో పాటు మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట, రాఘవపేట, చిట్టాపూర్, సిరిపూర్‌తో పాటు మరో 12 గ్రామాల్లోని చెరువులు, కుంటలకు సాగునీటి సరఫరా జరుగుతుంది. పదేళ్లుగా ఆయా గ్రామాల్లోని కొంతమంది రైతులు పిల్ల కాల్వల వద్ద ఏర్పాటు చేసిన షట్టర్లు(తలుపులు)ను ధ్వంసం చేయడంతో పాటు మరికొన్ని చోట్ల పూర్తిగా తొలగించడంతో నీరంతా ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలకు చేరుకుని అక్కడి నుంచి వాగులు, గోదావరి నదిలో కలిసి వృథాగా పోతుంది. దీంతో ఆయకట్టు చివరి గ్రామాలైన వెంపల్లి, వెంకట్రావుపేట, గొర్రెపల్లి, వాల్గొండ, మల్లాపూర్, కుస్తాపూర్, రత్నాపూర్, పాత, కొత్తదాంరాజుపల్లి, సంగెం, శ్రీరాంపూర్, ఒబులాపూర్ గ్రామాల్లోని పంటలకు సాగునీరు అందని పరిస్థితులు నెలకొంటున్నాయి. తొలగించిన షట్టర్లను తిరిగి బిగించాలని రైతులు అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవ



డంలేదు. దీనికి తోడు రెండు సంవత్సరాలుగా కురుస్తున్న భారీ వర్షాలకు కాల్వలకు గండ్లు పడటం రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది.

పదేళ్లుగా సాగు నీరు అందడం లేదు

–పనస సుధాకర్, రైతు, వాల్గొండ

మల్లాపూర్ మండలంలోని ఆయకట్టు చివరి గ్రామాలకు పది సంవత్సరాలుగా సాగునీరు అందడంలేదు. డి29 కాల్వ పైభాగంలో ఉన్న కొంతమంది షట్టర్లను తొలగించడంతో చివరి గ్రామాలకు సాగునీరు అందని పరిస్థితులు ఉన్నాయి. ఏళ్ల తరబడి అధికారులు, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులకు సమస్యను విన్నవిస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. సాగునీరు వృథాగా గోదావరి నదిలో కలవకుండా ఉండేందుకు షట్టర్ల బిగింపు చేపట్టాలి.

బావుల ఆధారంగానే..

–ఎల్క కమలాకర్, రైతు, సంగెం


ఎస్సారెస్పీ కాల్వల చివరి గ్రామాలైన తమకు సాగునీరు అందడంలేదు. ఏళ్ల తరబడి వ్యవసాయ బావుల ఆధారంగానే పంటలు సాగుచేస్తున్నాం. ప్రస్తుతం ప్రాజెక్టులో సాగునీరు పుష్కలంగా ఉన్నప్పటికీ చివరి గ్రామాల పంటలకు నీరు అందని పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు స్పందించి సాగునీటిని అందించే ఏర్పాట్లు చేయాలి.

# కోతల కాన్పులపై కొరడా

కరీంనగర్ : శస్త్రచికిత్సల ద్వారా ప్రసవాలను ప్రోత్సహిస్తున్నారన్న విషయమై కరీంనగర్‌లోని ఆరు మెటర్నటీ నర్సింగ్‌హెూంలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. నిబంధనలు పాటించకుండా శస్త్రచికిత్సలు చేసి ప్రసవాలు చేస్తుండటాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ తీవ్రంగా పరిగణించింది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రతి రోజు జరిగే సాధారణ, శస్త్రచికిత్స ప్రసవాల వివరాలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు నివేదిక ఇవ్వాలని నిర్ణయించింది. కానీ ప్రైవేట్‌లో అవేవి పట్టించుకోవడంలేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ దృష్టికి వచ్చింది. కొన్ని రోజుల కిందట డాక్టర్ వినీత అనే వైద్యాధికారి బృందం కరీంనగర్‌లో పలు ఆసుపత్రులను తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో ఆరు చోట్ల శస్త్రచికిత్సల కోసం నిబంధనలు పాటించడంలేదని బృందం గుర్తించి నివేదిక ఇచ్చింది.

నిబంధనలు పాటించకుండా..

అన్ని ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర



ప్రభుత్వం చెబుతోంది. సాధారణంగా రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్‌తోపాటు హైరిస్క్ గల గర్భిణులకు 37 వారాలు నిండిన తర్వాత.. ప్రసవ తేదీ రోజు ఆసుపత్రికి తీసుకొచ్చిన తర్వాత 12 గంటలలోపు సాధారణ ప్రసవానికి ప్రయత్నం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి వివరించారు. నొప్పులు రావడానికి అవసరమైన మందులు ఇవ్వాలి. అవేవి ఇవ్వకుండా శస్త్రచికిత్సలు చేసినట్లు తనిఖీ బృందం గుర్తించినట్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. సార్థోగ్రాఫ్ ఛార్జ్, కేషీట్ వంటివి కూడా అమలు చేయలేదని వివరించారు. సాధారణ గర్భిణులకు 40 వారాల గడువు ఉంటుందని, వారికీ శస్త్రచికిత్స చేసినట్లు గుర్తించామన్నారు.

ఆరు ఆసుపత్రులకు నోటీసులు..

కరీంనగర్‌లో 47 ఆసుపత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. ఎక్కువ ప్రసవాలు జరిగే ఆరింటిని తనిఖీ చేశారని డాక్టర్ లలితాదేవి తెలిపారు. కరీంనగర్‌లోని గౌతమి, స్టార్ ఉమెన్స్, యశోద కృష్ణ, శ్రీదేవి, శివానంద, లత మెటర్నటీ నర్సింగ్ హెూంలపై చర్యల కోసం ముందస్తు నోటీసులు జారీ చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు. ఇక నుంచి తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు.

## సమీకృతం.. అసంపూర్ణం!

గోదావరిఖని : రాష్ట్రంలో రైతులకు, వ్యాపారులకు, ప్రజలకు ఉపయోగంగా ఉండేలా కూరగాయలు, మాంసాహార క్రయ-విక్రయాలు జరపడానికి అత్యాధునిక సదుపాయాలతో చేపట్టిన సమీకృత మార్కెట్ భవనాలు పట్టణంలో పునాదులకే పరిమితమయ్యాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమీకృత మార్కెట్లు, శ్మశానవాటికలు, చెత్త నిర్వహణ కేంద్రాలు త్వరగా పూర్తి చేయాలని ఎప్పటికప్పుడు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ నిధుల కొరత కారణంగా రామగుండంలో మాత్రం పనులు ముందుకు సాగడం లేదు. రామగుండం ప్రాంతాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక నిధులతో మార్కెట్ భవన నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ నిధులు రాక గుత్తేదార్లు పనులను అర్ధాంతరంగా వదిలేశారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలని లేకుంటే గుత్తేదారులను బ్లాక్ లిస్టులో చేర్చుతామని నోటీసులు జారీ చేసి ఏమి పట్టనట్టు ఉంటున్నారు. దశలవారీగా గుత్తేదార్లకు నిధులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



రెండున్నరేళ్లుగా ముందుకు సాగని పనులు

రెండు దశాబ్దాల క్రితమే గోదావరిఖనిలోని విఠల్‌నగర్‌లో సమీకృత మార్కెట్ భవనం నిర్మించాలని తలచారు. నగరపాలిక అంచనాలు సిద్ధం చేసినప్పటికీ నిధుల లేమితో పనులు చేపట్టలేకపోయారు. రామగుండం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక నిధుల నుంచి రూ.5 కోట్లతో విఠల్‌నగర్‌లో నాలుగేళ్ల క్రితం సమీకృత మార్కెట్ భవన నిర్మాణ పనులు మొదలుపెట్టారు. రూ.1.5 కోట్ల వ్యయంతో పనులు చేపట్టిన గుత్తేదారు మధ్యంతర బిల్లుల కోసం ప్రభుత్వానికి నివేదించినా ప్రయోజనం లేకపోవడంతో పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. రిటైయిల్ దుకాణాలు పునాదులకే పరిమితం కాగా హెూల్‌సేల్ వ్యాపార భవనం స్లాబులు, గోడలు వరకు పూర్తి చేశారు.

బిల్లులు చెల్లిస్తేనే వేగిరం

ఎన్టీఆర్‌నగర్‌లో రూ.4.5 కోట్లతో రెండేళ్ల క్రితం సమీకృత మార్కెట్ భవన నిర్మాణ పనులు చేపట్టారు. పునాదుల వరకు నిర్మాణాలు పూర్తికాగానే గుత్తేదారు నిధుల కొరత కారణంగా పనులను నిలిపివేశారు. గుత్తేదార్లు చేపడుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ మధ్యంతర బిల్లులు చెల్లిస్తుంటే పనులు వేగవంతంగా ముందుకు సాగే అవకాశముండగా ఆ దిశగా పాలకవర్గం, అధికారులు ప్రయత్నం చేయడం లేదు. సిద్దిపేట, సిరిసిల్లలతో పాటు వివిధ ప్రాంతాల్లో సమీకృత మార్కెట్ భవన నిర్మాణాలు పూర్తయి ప్రజలకు సేవలందిస్తుండగా రామగుండంలో మాత్రం క్షేత్రస్థాయిలో నాయకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మార్కెట్ భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

## ఇంజినీర్లు పట్టించుకోక.. పనుల్లో నాణ్యత లేక..!

మిర్యాలగూడ : సీసీ రహదారులు, పక్క కాల్వలు 15 నుంచి 30 ఏళ్ల పాటు చెక్కు చెదరకుండా ఉండాలి. పైపులైన్లు 30 నుంచి 40 ఏళ్ల పాటు లీకేజీలు లేకుండా తాగునీరు అందించాలి. ఈ నిబంధనలన్నీ కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, పురపాలికలు, గ్రామాల్లో ఏటా రూ.కోట్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల తీరును, నాణ్యతను దగ్గరుండి పరిశీలించాల్సిన ఇంజినీర్లు పత్తా లేకపోవడంతో గుత్తేదారులదే ఇష్టారాజ్యమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిమెంట్ కాంక్రీట్ మిల్లర్ నడిపించే మేస్త్రీలే ఇంజినీర్లుగా పనులు చేయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు పురపాలికలు, గ్రామాల్లో ఇంజినీర్లు పనులు పరిశీలించక.. పక్క కాల్వల నిర్మాణం కొంత మేర పూర్తి చేసి.. మధ్యలో వదిలేయడంతో మురుగునీరు రోడ్ల వెంట ప్రవహిస్తోంది. రహదారులు, పక్క కాల్వలు అడ్డదిడ్డంగా నిర్మించడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మరి కొన్ని చోట్ల జాతీయ రహదారుల వెంట నూతనంగా పక్క కాల్వలు ఎత్తులో నిర్మించగా..రోడ్డు వెంట ఉన్న వీధుల్లోని పక్క కాల్వలు కిందికి అయి మురుగునీరు పారే పరిస్థితి లేకుండా పోయింది. పలు పట్టణాల్లో శాఖల మధ్య సమన్వయలోపం కారణంగా భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హెూళు కిందికి పోయి..రోడ్లు ఎత్తు పెరిగి వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సీసీ రహదారులు నిర్మించిన ఆరు నెలలకే కంకరలేస్తున్నాయి. ఇసుకకు బదులు ఎక్కువగా కంకరపొడి కలపడంతో రహదారులు నాసిరకంగా ఉంటున్నాయి. సూర్యాపేటలో తాళ్లగడ్డలోని హౌసింగ్ బోర్డు కాలనీ, చర్చి కాంపౌండ్, ముస్లింవాడ కాలనీ, తిరుమలనగర్, మానసనగర్, రైతు బజారు మార్కెట్ రోడ్డు, సాయిబాబా ఆలయం రోడ్డు, తదితర చోట్ల సీసీ రహదారుల నిర్మాణంలో గుత్తేదారులు నాణ్యత పాటించలేదు. రహదారులపై సిమెంటు లేచిపోయి దారుణంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

యాదగిరిగుట్టలోని ప్రధాన రహదారిపై అప్పుడే గుంతలు పడి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రద్దీ సమయంలో గుంతల వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

మిర్యాలగూడలోని తాళ్లగడ్డ ఇందిరమ్మ కాలనీలో అనేక వీధుల్లో పక్క కాల్వలు లేక మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుంటే పట్టించుకోకుండా..ఇంజినీర్ల అలసత్వం వల్ల ప్రజలు నివాసం లేని చెరువు భూమిలో కాల్వ నిర్మించడం కొస మెరుపు. రవీంద్రనగర్‌లో ఓ వీధిలో అడ్డదిడ్డంగా పక్క కాల్వ నిర్మించి రోడ్డు చివర వదిలేశారు. దీంతో మురుగునీరు మొత్తం రోడ్డు వెంట భారీగా నిలిచిపోతుంది. చర్చి రహదారిలోని హనుమాన్ దేవాలయం వద్ద ఇటీవల నిర్మించిన సీసీ రహదారి క్రమ పద్ధతిలో నిర్మించకపోవడంతో ప్రమాదకరంగా ఉంది.

దగ్గరుండి పనులు చేయించాలి

నిబంధనల ప్రకారం పురపాలికల్లోని వార్డులు, గ్రామాలతో పాటు ఇతర పనులన్నీ సంబంధిత డీఈలు, ఏఈలు దగ్గరుండి పర్యవేక్షించాలి. రూ.20 లక్షల పైబడిన పనులైతే ఈఈ స్థాయి అధికారి తనిఖీ చేయాలి. పని జరిగే చోట వర్క్ ఇన్‌స్పెక్టర్లు రోజంతా ఉండాలి. నిబంధనల ప్రకారం డీఈ, ఏఈలు కంకర, ఇసుక, సిమెంట్ మిశ్రమాలు ఇతర సామగ్రిని తనిఖీ చేస్తుండాలి. పనులు పూర్తయిన అనంతరం నాణ్యత నియంత్రణ అధికారులు పనులు పరిశీలించి ధ్రువీకరించాలి. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా మారుమూల గ్రామాల్లో ఎవరి పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. తమకు పర్సంటేజీలు ముట్టిన తర్వాత అధికారులు ఎంబీ పుస్తకంలో వివరాలు నమోదు చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

# రియల్ మాఫియా ఆగడాలు



కరీంనగర్ : కరీంనగర్ మండలంలో సబ్‌స్టేషన్, కాల్వల నిర్మాణాలకు, రైల్వే లైన్ల కింద రైతులు భూములు కోల్పోగా.. అవి మళ్లీ వారి పేరిట ధరణిలో చూపిస్తున్నాయి. దీనిని సొమ్ము చేసుకునేందుకు రియల్ మాఫియా కొత్త ఎత్తుగడలు వేస్తోంది. ఒక రైతు నుంచి భూమి కొనుగోలు చేసి.. పక్క వారి నుంచి మిగిలిన స్థలాన్ని లాక్కునేందుకు బ్లాక్‌మెయిల్ చేస్తోంది. వారి స్థలాల్లో హద్దులు పాతుతూ భయపెడుతోంది. ఇటీవల ఓ బాధిత రైతు తనకు జరిగిన అన్యాయాన్ని దృష్టికి తీసుకురాగా విషయం వెలుగులో వచ్చింది. అసలు ఏం జరిగిందో వివరిస్తూ కథనం.కరీంనగర్ గ్రామీణ మండలంలోని గోపాల్‌పూర్, దుర్శేడు గ్రామ రెవెన్యూ పరిధిలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి, ఎస్సారెస్పీ కాల్వలకు, రైల్వే లైను ఏర్పాటుకు కొందరు రైతులు 25 ఏళ్ల క్రితమే భూములను ప్రభుత్వానికి అప్పగించారు. ప్రతిఫలంగా నష్టపరిహారంతోపాటు, గ్రామ శివారులోని స్థలాన్ని ప్రభుత్వం వారికి అసైన్డ్ చేసింది. ఆ భూమిలో రైతులు ఏటా పంటలు పండించుకుంటున్నారు.

నాటి అధికారుల నిర్లక్ష్యంతోనే..

ఒక్కో సర్వే నంబరులో ఎక్కువ మంది రైతులు ఉండటం, కొందరు భూమి మొత్తం కోల్పోకపోవడం, నష్టపరిహారం చెక్కు అందుకున్న రైతుల భూమిని రెవెన్యూ యంత్రాంగం పహాణీలో తొలగించకపోవడం వంటి కారణాలు రియల్ మాఫియా ఆగడాలకు ఊతమిచ్చాయి. 2018లో ధరణి వెబ్‌సైట్ ఏర్పాటుతో పహాణీలో ఉన్న భూమి మొత్తాన్ని రెవెన్యూ యంత్రాంగం నమోదు చేసింది. కోల్పోయిన భూములకు సైతం రైతుబంధు వస్తోంది. దీనిని ఆసరాగా చేసుకొని కొందరు కక్కుర్తితో తమ పేరిట ధరణిలో చూపుతున్న పూర్తి భూమిని (కోల్పోయిన దాంతోపాటు మిగిలిన) రియల్ మాఫియాకు విక్రయించారు. దానిని కొనుగోలు చేశాక.. భూమి తక్కువ ఉండడంతో పక్క రైతుల భూముల్లో తమదేనంటూ మాఫియా విరుచుకుపడుతోంది. డిజిటల్ పాస్‌బుక్‌లో ఉన్న భూమికి హద్దులు ఏర్పాటు చేసుకుంటున్నామని దబాయిస్తు వారి స్థలాల్లో చొరబడుతున్నారు.

మంత్రి దృష్టికి సమస్య...

గోపాల్‌పూర్‌కు చెందిన ఓ రైతుకు ఉమ్మడి ఆస్తి కింద ఎనిమిది ఎకరాల భూమి ఉండేది. అన్నదమ్ముల పంపకాల్లో ఆయనకు 2.11 ఎకరాల భూమి వచ్చింది. ఇందులో రైల్వే లైన్ నిర్మాణంలో 0.38 ఎకరాల భూమి కోల్పోయాడు. మిగతా స్థలం ఆయనకు ఉండాలి. కానీ వారి పక్కన ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసిన రియల్ మాఫియా.. ఆయన భూమిలోకి వచ్చి దౌర్జన్యంగా హద్దులు ఏర్పాటు చేసింది. ప్రశ్నిస్తే దాడులు చేసింది. తనకు జరిగిన అన్యాయాన్ని ఆ రైతు స్థానిక మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి పోలీసులకు సూచించడంతో మాఫియా వారు తాత్కాలికంగా చర్యలు నిలిపివేశారు. ఇలాంటి బాధితులు ఆ ప్రాంతంలో చాలామందే ఉన్నారు.

పహాణీ పేర్లు తొలగించకపోవడంతో..– మహేశ్వర్, ఆర్డీవో, కరీంనగర్

అప్పటి రెవెన్యూ యంత్రాంగం పహాణీలో పారదర్శకంగా పేర్లను తొలగించకపోవటంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. పూర్తి వివరాలు తెలుసుకుంటాం.

# తెల్లబోతున్న పత్తి పంట



సిరిసిల్ల: వాతావరణ ప్రతికూల పరిస్థితులు ఈ ఏడాది పత్తి పంటపై తీవ్ర ప్రభావం చూపాయి. విత్తుకునే సమయంలో అనావృష్టి, మొక్కల ఎదుగుదలలో అతివృష్టి వల్ల పత్తి, ఇతర ఆరుతడి పంటలకు నష్టం ఏర్పడుతుంది. ఈ సీజన్ ప్రారంభానికి ముందే అన్నదాతలు పత్తి విత్తనాలు విత్తుకున్నారు. జూన్‌లో సకాలంలో వర్షాలు కురవక భూమిలోనే మాడిపోయాయి. ఒక్కో రైతు రెండు, మూడు సార్లు విత్తనాలు నాటారు. విత్తనాలు మొలకెత్తి ఎదుగుతున్న జులై, ఆగస్టు నెలల్లో అధిక వర్షపాతం నమోదైంది. ఇది పంట ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపింది. వాతావరణం అనుకూలిస్తే ప్రస్తుతం పత్తి పంట ఏపుగా పెరిగి పూత, కాయలతో నిండుగా ఉండాలి. అక్టోబరు నుంచి పత్తి తీత ప్రారంభమవుతుంది. నవంబరులో మార్కెట్ ప్రారంభంతో వ్యాపారులు, సీసీఐ కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. పూత, కాత వచ్చినా మొక్కలు బలంగా లేవు. సెప్టెంబరులో అడపాదడపా వర్షాలు కురిసినా అంతంత మాత్రమే. ప్రయోజనం లేదు. బోర్లు, బావులు ఉన్న రైతులకు ఇబ్బంది లేదు.

జిల్లాలో ఈ సీజన్‌లో 2.33 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అందులో పత్తి 50,523 ఎకరాల్లో సాగైంది. ఈ సారి పత్తి సాగు రైతులకు కష్టంగా మారింది. ప్రతికూల వాతావరణంతో మొక్కల ఎదుగుదల పూర్తిగా క్షీణించింది. ఈ సమయానికి నాలుగు అడుగులు పైగా పెరగాలి. కానీ ప్రస్తుతం ఒకటి, రెండు అడుగుల్లోనే ఉన్నాయి. పంట కాలం గడిచే కొద్దీ ఇదే ఎదుగుదలలో పూత, కాయ వస్తుంది. ఇది నాణ్యత, దిగుబడిపై ప్రభావం చూపుతుంది. జిల్లా వ్యాప్తంగా 50 శాతం పంటది ఇదే పరిస్థితి. మెట్ట ప్రాంతంలో ఎకరాకు సగటున ఆరు క్వింటాళ్లు, నల్లరేగడి నేలల్లో 12 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా. ఈసారి అనుకున్న లక్ష్యంలో 30 శాతం మేరకు పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది. పత్తిని ఒకటి, రెండు సార్లు తీశాక కాయలకు శనగపచ్చపురుగు, లద్దెపురుగు ఆశిస్తుండటమే ఇందుకు కారణం. కానీ ఈసారి ముందే ఈ రకం చీడపీడలు ఆశించడంతో పూత, కాయలు రాలిపోతున్నాయి.

గతేడాదిలోనూ వాతావరణ ప్రతికూలతలతో పత్తి దిగుబడులు తగ్గాయి. జిల్లాలోని వేములవాడ మార్కెట్‌లో కొనుగోళ్లు లేకపోవడంతో రైతులు నేరుగా జిన్నింగ్ మిల్లులకు తీసుకెళ్లి విక్రయించారు. మరికొందరు గ్రామాల్లోనే ఇతర రాష్ట్రాల దళారులకు విక్రయించారు. అప్పుడు మార్కెట్ ప్రారంభంలో రూ.9 వేల పైన ధర పలికింది. మార్కెట్‌లో పత్తి లభ్యత పెరిగే కొద్దీ ధర తగ్గింది. ప్రస్తుతం వరంగల్ మార్కెట్‌కు గతేడాది పత్తితోపాటు ఈ సీజన్ పత్తి కూడా వస్తోంది. పాత పత్తి వరంగల్ మార్కెట్‌లో క్వింటాకు రూ.7000, కొత్తది రూ.6,600, జమ్మికుంట మార్కెట్‌లో రూ.7200 పలుకుతోంది. సీసీఐ మద్దతు ధర రూ.7,020గా ఉంది.పత్తి ఆధారిత నూలు ధారం విక్రయాలు ఆశించిన స్థాయిలో లేవు. దీని ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో బేళ్ల కొనుగోళ్లు తగ్గాయి. ఇది పరోక్షంగా మార్కెట్‌లోని పత్తి ధరలపై చూపుతుంది. జిన్నింగ్ మిల్లుల యజమానులు కూడా పత్తిని ఆచితూచి కొనుగోలు చేసే అవకాశం ఉంది. పత్తి పంట చేతికొచ్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగితే మార్కెట్లో ధరలపై ప్రభావం పడుతుంది. గతేడాది ఇదే పరిస్థితి ఉంటే జిన్నింగ్ మిల్లులు మూడు, నాలుగు నెలలు మించి నడపలేక మూసివేశారు. మార్కెట్ ఒడిదొడుకుల వల్ల జిన్నింగ్, స్పిన్నింగ్ పరిశ్రమలు కూడా సంక్షోభాన్ని ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయి.ప్రత్యామ్నాయం చూసుకోవాలి– భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారిఈ సీజన్‌లో ప్రతికూల పరిస్థితులు పత్తి పంటపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. డిసెంబరు వరకు రెండు సార్లు పత్తిని ఏరాక అశించిన స్థాయిలో దిగుబడి రాకపోతే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నీటి వసతి ఉన్న రైతులు పత్తిని తీసేసి, మొక్కజొన్న, ఇతర ఆరు తడి పంటలను ప్రత్యామ్నాయంగా సాగు చేసుకుంటే నష్టాలను అధిగమించే అవకాశం ఉంటుంది.

# నిర్మాణాలు పూర్తి.. ప్రారంభమేదీ?

మెట్‌పల్లి : గ్రామాల్లో పలు మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి పనులు కూడా పూర్తి చేశాయి. కాగా జిల్లా స్థాయి, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులకు తీరిక లేకనేమో ఆ భవనాలు ప్రారంభానికి నోచుకోక గ్రామస్థులకు పలు సేవలు అందుబాటులోకి రావడం లేదు. దీంతో గ్రామస్థులు ప్రయాస పడుతున్నారు.

సుల్తానాబాద్ ప్యాక్స్ ఆధ్వర్యంలో రూర్బన్ రెండో దశ నిధులు రూ.40 లక్షలతో సుల్తానాబాద్-అశోక్‌నగర్‌లో గిడ్డంగుల నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తిచేసి నెలరోజులు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో విత్తనాలు, యూరియా, ఎరువులు నిల్వ చేయడానికి స్థలం లేక రైతులకు కావాల్సిన ఎరువులను ఎప్పటికప్పుడు తెచ్చుకోవాల్సి వస్తుంది. దీంతో పలు సమయాల్లో ఎరువులు రైతులకు అందుబాటులో లేక ప్రయాస పడుతున్నారు. గిడ్డంగులను ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు రైతులు కోరారు.

గర్రెపల్లిలో రూర్బన్ నిధులు రూ.8 లక్షలతో ఈ-పంచాయతీ భవనాన్ని ఏర్పాటు చేశారు. పనులు పూర్తి చేసుకొని నెల రోజులు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఇళ్లు, పలు నిర్మాణాల అనుమతి, పలు ధ్రువపత్రాల కోసం గ్రామస్థులు మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. భవనాన్ని ప్రారంభించి అందుబాటులోకి తీసుకువస్తే గ్రామస్థుల ప్రయాస తప్పుతుంది.

నీరుకుళ్ల గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకోగా రూర్బన్, ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించారు. నిర్మాణం పూర్తి చేసుకొని ఆరు నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో శిథిలావస్థలో ఉన్న పంచాయతీ భవనంలోనే పాలకవర్గం, అధికారులు సేవలు కొనసాగిస్తున్నారు.



భవనాన్ని ప్రారంభించి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరారు.ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌లో ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో రైతు వేదిక నిర్మించారు. రెండేళ్ల క్రితమే రాష్ట్రంలోనే మొదట పూర్తయిన రైతు వేదికగా పేరుగాంచింది. ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించదలచి.. ఆ తర్వాత అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. ఇప్పటికీ రైతు వేదిక ప్రారంభానికి నోచుకోలేదు. గ్రామానికి దూరంగా ఉండి రైతులకు సేవలు మాత్రం అంతంతా మాత్రమే అందుతున్నాయి.

## వారధి... ఏదీ పురోగతి...

పిట్లం : రహదారులతో పాటు వారధుల నిర్మాణం ప్రజా రవాణాకు ఎంతో కీలకం. వంతెనలు లేకపోతే గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. వర్షాకాలం, అత్యవసర సమయాల్లో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. వాగులు, వంకలపై వంతెనల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా గుత్తేదారు, అధికారుల నిర్లక్ష్యం వల్ల కొన్ని నెలలుగా పనుల్లో పురోగతి ఉండడం లేదు. అంతర జిల్లాలను అనుసంధానం చేసే కామారెడ్డి జిల్లా పిట్లం మండలం తిమ్మానగర్, సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం ఫత్తేపూర్ మధ్య నల్లవాగుపై వంతెన కోతకు గురైంది. ఈ కారణంగా ప్రజలు పడుతున్న అవస్థలపై కథనం.

మూడేళ్లుగా పాట్లు...

నల్లవాగుపై ఆరు దశాబ్దాల కిందట వంతెన నిర్మాణం చేపట్టారు. మూడేళ్ల కిందట వాగు పొంగిపొర్లడంతో ముళ్ల పొదలు, చెట్ల దుంగలు కొట్టుకు వచ్చి నిలవడంతో రోడ్డు, వంతెన కోతకు గురైంది. రాకపోకలకు తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అది కోతకు గురై అటు సంగారెడ్డి, ఇటు కామారెడ్డి జిల్లాకు రాకపోకలు నిలిచిపోయాయి.

దూరభారం ...

2022లో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.8 కోట్లు మంజూరు చేసింది. ఆర్‌అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో చేపట్టే పనులను గుత్తేదారులు నిబంధనల ప్రకారం పూర్తి చేయాల్సి ఉంది. గుత్తేదారు దిమ్మెల వరకు వారధికి స్లాబు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. కొన్ని నెలలుగా నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. వంతెన అందుబాటులోకి రాకపోవడంతో ఆయా మండలాల ప్రజలు పిట్లం నుంచి కల్హేర్ మార్గ్ది, బీబీపేట్ మీదుగా సిర్గాపూర్, నారాయణఖేడ్‌కు, పిట్లం నుంచి మాసాన్‌పల్లి మీదుగా అదనపు ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఈ మార్గాల్లో ప్రయాణానికి దూరభారంతో పాటు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

తొందరగా పూర్తి చేయాలి

సాయిగొండ, ఫత్తేపూర్

వ్యవసాయ ఇతరత్రా పనులకు పిట్లంకు వస్తుంటాం. తిమ్మానగర్, కల్హేర్ మండలం ఫత్తేపూర్ మధ్య నల్లవాగుపై వంతెన నిర్మాణ పనులు పూర్తయితే రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయి. సంగారెడ్డి జిల్లా కల్హేర్, సిర్గాపూర్, నారాయణఖేడ్ ప్రాంతాల రాకపోకలకు ప్రధాన మార్గం ఇదే. అంపూర్తి వంతెన పనులు తొందరలో పూర్తి చేయాలి.

వేగవంతం చేస్తాం

వినోద్‌కుమార్, ఆర్ అండ్‌బీ ఏఈ, పిట్లం


ఎగువన నల్లవాగు పొంగిపొర్లింది. వరద ఉద్ధృతికి తిమ్మానగర్ వద్ద నిర్మాణం చేపడుతున్న వంతెన వద్ద అడుగుభాగాన వేసిన కంకర కొట్టుకుపోయింది. వర్షాలతో పనులకు ఆటంకం కలుగుతోంది. చిన్న చిన్న పనులు కొనసాగుతున్నాయి. వానలు తగ్గుముఖం పట్టగానే పూర్తిస్థాయిలో పనులు ప్రారంభమవుతాయి.

## మూడింటిపై కొలిక్కిరాని కసరత్తు

కామారెడ్డి : అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే జిల్లాలో రాజకీయ వేడి రగులుకుంటోంది. ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన భారాస ప్రచార వ్యూహాలను సిద్ధం చేస్తుంటే.. కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపుపై ముమ్మర కసరత్తు చేస్తోంది. కామారెడ్డి నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థిత్వంపై స్క్రీనింగ్ కమిటీ ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. జుక్కల్, ఎల్లారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లో ఆశావహుల మధ్య తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో రాష్ట్ర నాయకత్వం నుంచి మరింత సమాచారం సేకరించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మూడు నియోజకవర్గాల్లోని ఆశావహుల్లో టికెట్ల కేటాయింపుపై ఉత్కంఠ నెలకొంది.

గెలుపు గుర్రాల కోసం సర్వేలు

కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు ప్రధాన నాయకులతో పాటు ద్వితీయ శ్రేణి నేతలు దరఖాస్తు చేసుకున్నారు. బాన్సువాడ నుంచి అత్యధికంగా 16 మంది, జుక్కల్ నుంచి 14 మంది, ఎల్లారెడ్డి నుంచి నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. కామారెడ్డి నుంచి ఇద్దరు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. కామారెడ్డి నుంచి షబ్బీర్ అలీకి సీటు ఖాయంగా కనిపిస్తుండగా మిగిలిన స్థానాల్లో ఆశావహుల బలాబలా




లపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు ఆధ్వర్యంలో పలుమార్లు సర్వే చేయగా.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క రాష్ట్ర నేతలు సైతం వేర్వేరుగా సర్వేలు చేయించినట్లు సమాచారం.

సమాచారమివ్వాలని..

ఇటీవల దిల్లీలో జరిగిన స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడల్లో పార్టీ అభ్యర్థిత్వాల ఖరారు కొలిక్కిరానట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆశావహుల సామాజిక వర్గాల బలాబలాలు, పార్టీ పట్ల వారికున్న విధేయత, ఇతరత్రా అంశాలపై సమగ్ర సమాచారం ఇవ్వాలని స్క్రీనింగ్ కమిటీ సభ్యులు రాష్ట్రపార్టీ నేతలను నిర్దేశించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కలతో పాటు స్క్రీనింగ్ కమిటీలోని సభ్యులు జిల్లాకు చెందిన సీనియర్ నేతలతో మంతనాలు జరుపుతున్నారు. ఆశావహులకు నియోజకవర్గా బలాబలాలపై వివరాలు సేకరిస్తున్నారు.

ఎటూ తేల్చలేక..

సర్వేల ఆధారంగానే ఒక్కో నియోజకవర్గానికి ఇద్దరు నుంచి ముగ్గురిని ఎంపిక చేసిన రాష్ట్రనేతలు ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీకి నివేదించారు. ఈ కమిటీలో సభ్యులు ఎవరికి వారే తమ అనుచరులకు టికెట్ కోసం పట్టుపట్టడంతో ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారు కొలిక్కి రాలేదని సమాచారం. ముఖ్యంగా ఎల్లారెడ్డి నుంచి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు టికెట్ కోసం పోటీపడుతున్నారు. పార్టీ అధిష్ఠానం ఇరువురిని సంతృప్తి పరిచేందుకు ఒకరిని జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీచేయాలని కోరినట్లు తెలుస్తోంది. ఇందుకు ఇరువురు ససేమిరా అనడంతో ఒకరిని బాన్సువాడ నుంచి పోటీచేయాలని సూచించినట్లు తెలుస్తోంది. ఇందుకు సైతం ఒప్పుకోకపోవడంతో ఎల్లారెడ్డితో పాటు బాన్సువాడ నియోజకవర్గం పార్టీ టికెట్ కేటాయింపును తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. జుక్కల్ నియోజకవర్గంలో ముగ్గురు ఆశావహులు పోటీపడుతున్న నేపథ్యంలో విజయావకాశాలు ఎవరికుంటాయనే దానిపైనే స్క్రీనింగ్ కమిటీ సభ్యులు తేల్చుకోలేకపోతున్నట్లు సమాచారం.

# వీధి కుక్కల వీరంగం

వరంగల్ : కాలనీల్లో వీధి కుక్కల వీరంగం సృష్టిస్తున్నాయి. నగరంలో రోజూ ఏదో ఒకచోట ప్రజలకు కుక్క కాట్లు తప్పడం లేదు. వరంగల్ కాశీబుగ్గలో ఆరేళ్ల బాలుడిపై దాడి చేసిన ఘటన మరువక ముందే వరంగల్ పాపయ్యపేట కుంటి భద్రయ్యగుడి వద్ద ఐదేళ్ల బాలుడు రాముపై వీధి కుక్క దాడి చేసింది. చేతులు, వెన్నులో ఎనిమిది కాట్లు పడ్డాయి. స్థానికులు చూసి ఉండక పోతే తీవ్ర గాయాలైవి. గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న 29వ డివిజన్ పాపయ్యపేట, రామన్నపేట పెద్దమోరీ, గంగపుత్ర వీధి, రామన్నపేట ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. వీధి కుక్కల నివారణ చర్యలు ముమ్మరం చేశామని బల్దియా ప్రజారోగ్య విభాగం అధికారులంటున్నారు. నగరంలోని ఏ వీధిలో చూసిన గుంపు గుంపులుగా గ్రామ సింహాలు కనిపిస్తున్నాయి. వీధి కుక్కల కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు, పాఠశాలలు, కాలనీల్లో అవగాహన సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకుడు ఉత్తర్వులు జారీ చేసిన గ్రేటర్ వరంగల్ యంత్రాంగం కదలడం లేదు. ఏదైనా ఘటన జరిగితేనే ఆ రోజు మటుకు సీరియస్‌గా తీసుకుంటున్నారు. తర్వాత షరా మామూలవుతుంది. నగరంలోని 66 డివిజన్లలో 20వేల పైనే వీధి కుక్కలుంటాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పరిశీలనలో తేలింది.

తాజా ఘటనలు

29వ డివిజన్ పాపయ్యపేట కుంటి భద్రయ్య గుడి వద్ద రాము అనే ఐదేళ్ల బాలుడిపై వీధి కుక్క దాడి చేసింది. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందారు.

వరంగల్ రంగంపేట పోలీసు క్వార్టర్స్ వెనుకల రాములు అనే వృద్ధుడు గాయపడ్డాడు. చేతి, కుడి కాలుపై నాలుగు కాట్లు పడ్డాయి.

40వ డివిజన్ నానమీయతోటలో గృహిణి గాయపడింది. చేతిపై రెండు కాట్లు పడటంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు.

హనుమకొండ పద్మాక్షి కాలనీలో నాలుగు రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడి కుక్కలు వెంబడించాయి. భయంతో వాహనం అదుపుతప్పి కింద పడటంతో చేతికి గాయమైంది.

మామునూరు, బొల్లికుంట, భట్టుపల్లి, గొర్రెకుంట, ఆరెపల్లి విలీన గ్రామాల్లో స్థానిక ప్రజలు గాయపడ్డారు.

ప్రతిరోజూ ఎంజీఎం ఆసుపత్రికి 10–15 మంది కుక్క కాటు బాధితులు వస్తున్నారని తెలిసింది.


ములుగురోడ్డు: 22వ డివిజన్ బ్యాంక్‌కాలనీలో ఒకటో తరగతి చదువుతున్న ఆరు సంవత్సరాల జశ్వంత్ వీధిలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. పక్కన ఓ ఇంటి వద్ద ఇద్దరు మహిళలు మాట్లాడుకుంటూ ఉన్నారు. ప్రశాంతంగా ఉన్న వీధిలో ఓ పక్క నుంచి మెల్లగా నడుచుకుంటూ వచ్చిన వీధి కుక్క ఒక్కసారిగా బాలుడి పై దాడి చేసింది. పక్కనే ఉన్న ఓ మహిళ తన చీర కొంగుతో కుక్కను అదరగొట్టింది. కుడి భుజం పై జశ్వంత్‌కు గాయాలు అయ్యాయి. దేశాయిపేటరోడ్‌లో కూతటి రఘుపై కుక్క దాడిచేయడంతో కాలుకుగాయమైంది.

కోతుల స్వైరవిహారం

నగరంలో కోతులు, కుక్కల దాడులు పెరిగిపోతున్నాయ్. రంగశాయిపేట, ఖిలావరంగల్, శివనగర్, పెరుకవాడ, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో జనావాసాల్లో సమూహాలుగా తిరుగుతూ ఇళ్లలో చొరబడి అందిన వస్తువులు ధ్వంసం చేస్తున్నాయి. పలుచోట్ల పాఠశాల విద్యార్థుల చేతిలోని భోజన బ్యాగులను లాక్కుంటున్నాయి. దీంతో చిన్నారులు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల రోడ్లపై దారికాచి ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# గొర్రెలు, మేకల పెంపకానికి ప్రోత్సాహం

వరంగల్ : మాంసం ఉత్పత్తులను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) ద్వారా గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి చేయూతనిస్తోంది. యూనిట్ విలువ రూ.10 లక్షల నుంచి రూ.కోటి కాగా, అందులో ప్రభుత్వం 50 శాతం రాయితీ అందిస్తోంది. గొల్ల కురుమలకే కాకుండా అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు అర్హులే.. పశు సంవర్ధక శాఖ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. పథకంపై అంతగా ప్రచారం, అవగాహన లేకపోవడంతో అర్హులైన లబ్ధిదారుల నుంచి స్పందన కొరవడింది. ఎన్ఎల్ఎం ద్వారా ఇంతవరకు కాటారం మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఓ గిరిజన రైతుకు ఒక యూనిట్ మాత్రమే మంజూరు చేశారు. పథకం కింద రూ.50 లక్షలు రాయితీ, రూ.40 లక్షలు బ్యాంకు రుణం, మిగతా రూ.10 లక్షలు లబ్ధిదారులు వాటాగా చెల్లించాలి. యూనిట్ కింద 500 గొర్రెలు, 25 పొట్టేళ్లు ఇచ్చేవారు. యూనిట్ విలువ ఎక్కువగా ఉండటంతో బ్యాంకులు హామీ లేకుండా రుణాలు ఇవ్వడం లేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎన్ఎల్ఎం పథకం నిబంధనలను సరళతరం చేస్తూ మార్పులు చేసింది. యూనిట్లను ఐదు విభాగాలుగా విభజించింది. ఇందులో ఏ యూనిట్ ఎంచుకున్నా



50 శాతం రాయితీ లభిస్తుంది. మేకలు, గొర్రెలే కాకుండా దేశవాళీ కోళ్లు, పందుల పెంపకం కూడా చేపట్టవచ్చు. వీటి యూనిట్ విలువ రూ.50 లక్షలకే పరిమితం. ఎంపిక చేసుకున్న యూనిట్ ఆధారంగా రెండు నుంచి పదెకరాల భూమి అవసరం ఉంటుంది. సొంత భూమి లేకుంటే లీజుకు తీసుకోవచ్చు. చుట్టూ ఫెన్సింగ్ వేసి, షెడ్లు నిర్మించి అందులోనే మేత ఏర్పాట్లు చేసుకోవాలి. అన్ని ఒరిజనల్ డాక్యుమెంట్లు జత చేస్తూ, ఆన్‌లైన్ ద్వారా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. లేదా మండలాల్లో పశు వైద్యాధికారిని సంప్రదించాలి. అప్లికేషన్ కాపీలను జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది.ఎంపిక విధానం : ఎన్ఎల్ఎంకు రాష్ట్ర స్థాయిలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. లబ్ధిదారుల ఎంపికకు రాష్ట్ర, కేంద్ర స్థాయిలో రెండు కమిటీలు ఉంటాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. బ్యాంకు రుణం మంజూరైన తర్వాత 25 శాతం, యూనిట్ గ్రౌండింగ్ సమయంలో మిగతా 25 శాతం సబ్సిడీ వస్తుంది.అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి

– వడ్లమూరి రంగారావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

కేంద్ర ప్రభుత్వం ఎన్ఎల్ఎం ద్వారా గొర్రెలు, మేకలు, కోళ్లు పందుల పెంపకంతో పాటు ఫీడ్ అండ్ పుడర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చు. అన్ని యూనిట్లపైనా 50 శాతం సబ్సిడీ లభిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు ఒకరికి మాత్రమే యూనిట్ మంజూరైంది. లాభదాయకమైన ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

# నవతరం.. తీరు అభ్యంతరకరం!



కొత్తగూడెం : నేటి తరం యువత కొందరు తమకు లభిస్తున్న స్వేచ్ఛతో పెడదోవ పడుతున్నారు. పదోతరగతి పూర్తయి ఇంటర్మీడియట్, ఆ తర్వాత డిగ్రీలో చేరుతున్న వారు.. తల్లిదండ్రులు, విద్యాలయాల యాజమాన్యాల ప్రత్యక్ష పర్యవేక్షణలోంచి బయటపడ్డామన్న భావనతో మితిమీరి ప్రవర్తిస్తున్నారు.నేటి తరం యువత కొందరు తమకు లభిస్తున్న స్వేచ్ఛతో పెడదోవ పడుతున్నారు. పదోతరగతి పూర్తయి ఇంటర్మీడియట్, ఆ తర్వాత డిగ్రీలో చేరుతున్న వారు.. తల్లిదండ్రులు, విద్యాలయాల యాజమాన్యాల ప్రత్యక్ష పర్యవేక్షణలోంచి బయటపడ్డామన్న భావనతో మితిమీరి ప్రవర్తిస్తున్నారు. చదువుకు దూరమైన పలువురు టీనేజర్లలోనూ ఇదే ధోరణి ప్రబలుతోంది. మితిమీరిన స్వేచ్ఛ.. దురలవాట్లు, నేరాల బాట పట్టేందుకు కారణమవుతోంది. ఇలాంట వారిని అదుపు చేయడం కళాశాలల యాజమాన్యాలు, సమాజానికి సాధ్యం కావడం లేదు. ఫలితంగా విద్యాబుద్ధులు నేర్వాల్సిన తరుణంలో కొందరు మత్తుకు బానిసలవుతున్నారు. జల్సాల కోసం దొంగతనాలకు తెగబడుతున్నారు. కామవాంఛ తీర్చుకునేందుకు బరితెగిస్తున్నారు. ఈ తరహా నేరాల్లో పది, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ చదివేవారు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగించే అంశం. దీంతో ఉజ్వల భవిత నాశనమై కటకటాలపాలవుతున్నారు. కొంతకాలంగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో నమోదవుతున్న గంజాయి రవాణా, పోక్సో, చోరీ కేసుల్లో 15–25 ఏళ్లలోపు యువత నిందితులుగా ఉండటం గమనార్హం. తల్లిదండ్రులూ.. పారాహుషార్.

ఫిబ్రవరి 9, 2023: పాల్వంచ మండలంలోని ఓ ఉన్నత పాఠశాలకు చెందిన బాలిక(12)ను మధ్యాహ్నం విశ్రాంతి సమయంలో సమీప వాగు వద్దకు తీసుకెళ్లిన నలుగురు తోటి విద్యార్థులైన బాలురు.. ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. ఈ ఘటనపై గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు అందగా.. విద్యార్థులపై పోక్సో కేసు నమోదైంది.

మార్చి 1:

లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఓ గిరిజన గ్రామంలో మూడో తరగతి చదివే బాలిక(8)ను బంధువైన స్థానిక బాలుడు(15) సమీప నిర్మానుష్య ప్రాంతానికి ఒంటరిగా తీసుకెళ్లాడు. మార్గం మధ్యలో గమనించిన కొందరు చిన్నారులు ఈ విషయాన్ని ఆమె తల్లిదండ్రుల చెవిన పడేయడంతో వెంటనే వెళ్లి రక్షించారు.

మార్చి 1:

కారేపల్లిలోని ఓ సంక్షేమ వసతి గృహంలో ఉంటూ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఎవరికీ చెప్పకుండా భద్రాద్రి జిల్లా కేంద్రానికి వచ్చారు. ఒకరోజు స్థానిక పోస్ట్‌మెట్రిక్ హాస్టలులో నిద్రించారు. వారు తిరిగి వెళ్లాక పలువురి స్మార్ట్‌ఫోన్లు మాయం కావడంతో బాధితులు 'గూడెం' స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కారేపల్లి వచ్చి స్మార్ట్‌ఫోన్లు రికవరీ చేశారు.

తరగతి గదులు వదిలి.. పెడదోవ..కొన్ని పట్టణాల్లో రాజకీయ నాయకుల అనుచరులు తమ పనుల కోసం కొందరు కళాశాల, వసతిగృహాల విద్యార్థులకు ప్రలోభాలు ఎరచూపి వాడుకుంటున్నారు. అలా తరగతి గదులు దాటి.. రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో పాల్గొనేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. ర్యాలీలు తీసినా, సమావేశం పెట్టినా, ఆందోళనలు జరిగినా ఛోటామోటా నాయకులు పబ్బం గడుపుకొనేందుకు బాలురను పావులుగా వాడుకుంటున్నారు. ఈ క్రమంలో విందులు, వినోదాలు, జల్సాలకు బాలలు అలవాటుపడుతున్నారు. కొన్ని ప్రభుత్వ కళాశాలలు, వసతిగృహాల వెనుక, సమీప ప్రాంతాల్లోని నిర్మానుష్య ప్రాంతాల్లో ఖాళీ మద్యం సీసాలు, సిగరెట్ పీకలు, గంజాయి పొట్లాలు దర్శనమిస్తున్నాయంటే పరిస్థితి ఎంతవరకు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు.

ఓ కంట కనిపెట్టడమే మేలు

డా.అజ్మీరా వెంకన్న, ఎండీ, కొత్తగూడెం

ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ వంటి పైచదువులకు పిల్లలను పంపే తల్లిదండ్రులు వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను తెలుసుకునేందుకు సమయం కేటాయించాలి. నడవడిక, అలవాట్లు, ఆలోచనా విధానం, చదువులో రాణింపు, స్నేహాల ప్రభావం, మానసిక స్థితిగతులపై ఓ కన్నేసి ఉంచాలి. ఏమాత్రం మార్పులు గమనించినా తగిన చర్యలు తీసుకోవాలి. కొందరు మద్యం, బెట్టింగ్, జల్సాలకు అలవాటై అసాంఘిక కార్యకలాపాలకూ వెనుకాడటం లేదు. ఇలాంటి సందర్భాల్లో కళాశాలల యాజమాన్యాలు, కన్నవాళ్లు పెడదోవ పట్టే యువతను ఆదిలోనే గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తే భవిష్యత్తు నాశనం కాకుండా ఉంటుంది.

# కొలువు నిరీక్షణకు తెరపడేదెప్పుడో?



సత్తుపల్లి : సత్తుపల్లికి చెందిన ఎస్‌కె.ఆజాద్ అనే డీఎస్సీ క్వాలీఫైడ్ అభ్యర్థి ప్రింటింగ్ ప్రెస్‌లో రోజూవారి కూలీగా పని చేస్తున్నారు. కొన్ని రోజులపాటు ప్రైవేటు స్కూల్లో పని చేసిన ఆయన ఆ తర్వాత ప్రింటింగ్ ప్రెస్‌లో చేరి తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. విశ్రాంత ఉద్యోగి అయిన తన తండ్రి పెన్షన్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. భార్య, ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లోనే జీవించాల్సి వస్తోంది. అర్హత ఉన్నప్పటికీ తమకు న్యాయం జరగకపోవడంతో కుమిలిపోతున్నట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి చదివి 1998 డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరి సమాజంలో విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఎన్నో కలలు కన్నారు. కొలువు పొందేందుకు అన్ని అర్హతలు సాధించారు. అనూహ్యంగా వచ్చిన ప్రభుత్వ ఉత్తర్వు వారి కలలను కల్లలు చేసింది. రెండున్నర దశాబ్దాలుగా ప్రభుత్వాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. కుటుంబ పోషణ నిమిత్తం దినసరి కూలీల అవతారం ఎత్తారు. పొరుగు రాష్ట్రంలో అభ్యర్థులకు ఉపశమనం లభించింది. తమకూ అనుకూల తీర్పు వస్తుందనే ఆశతో అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు.

ఇదీ విషయం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1998లో నాటి ప్రభుత్వం 40వేలకు పైగా పోస్టులను భర్తీ చేయాలని డీఎస్సీని ప్రకటించింది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వందలాది మంది పోటాపోటీగా చదివి డీఎస్సీ ఉత్తీర్ణత సాధించారు. ముఖాముఖీల్లోనూ ప్రతిభ చూపి ఇక ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న క్రమంలో జీఓ 3 ప్రతిబంధకంగా మారింది. దీని ప్రకారం ఏజెన్సీ ఉద్యోగాలు ఆ పరిధిలో వారికి ఇవ్వాలని, నాన్ ఏజెన్సీలో ఆయా పరిధిలో ఉన్న అభ్యర్థులకు ఇవ్వాలని జీఓ ఉండటంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 262 పోస్టులను భర్తీ చేయకుండానే వదిలేసి ఆ తర్వాత డీఎస్సీకి పోస్టులను బదిలీ చేశారు. దీంతో ఉత్తీర్ణత సాధించిన 252 మంది అభ్యర్థులు ఉద్యోగాలను కోల్పోవాల్సి వచ్చింది. కొందరు రాజకీయ నాయకుల తప్పిదం కారణంగా 2000 సంవత్సరంలో అమలు చేయాల్సిన సదరు జీఓను 1998 డీఎస్సీకి అడ్డుపెట్టడంతోనే తమకు అన్యాయం జరిగిందని పలువురు అభ్యర్థులు గగ్గోలు పెడుతున్నారు. ట్రైబ్యునల్, హైకోర్టును సైతం వారు ఆశ్రయించగా అభ్యర్థులకు అనుకూలంగా 2014లోనే న్యాయస్థానాలు తీర్పునిచ్చాయి.

బేతుపల్లికి చెందిన పాండే సుధాకర్‌బాబు తమ గ్రామంలోని కోత మిల్లులో దినసరి కూలీగా పని చేస్తున్నారు. డీఎస్సీలో క్వాలీఫై అయినా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోవడం కోసం కూలీగా మారినట్లు ఆయన పేర్కొన్నారు. వేరే పనేమీ రాకపోవడంతో కోత మిల్లులోనే నాటి నుంచి పని చేస్తున్నారు. చాలీచాలని కూలీతో ఇద్దరు పిల్లలు, కుటుంబ భారం మోయలేని పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

నిరంతరం పోరాడుతూనే..తమ సమస్యపై కాంగ్రెస్ హయాంలో నాటి సీఎం వైఎస్ఆర్‌ను కలిశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సైతం తమ బాధలు విన్నవించారు. అయినా కొలిక్కిరాలేదు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల్లో ఇప్పటికే కొందరు మృతి చెందగా వంద మందికిపైగా అభ్యర్థులు నేటికీ ఉద్యోగాల కోసం పోరాడుతూనే ఉన్నారు. కేవలం కొందరు అధికారులు రాజకీయ నాయకుల అండతో ప్రభుత్వాలను తప్పుదోవ పట్టించి న్యాయస్థానాలకూ తప్పుడు నివేదికలను ఇవ్వడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. డీఎస్సీ అభ్యర్థులు ఉపాధి వెతుక్కుంటూ దినసరి కూలీలుగా, దుకాణాల్లో, కోత మిల్లుల్లో, ప్రైవేటు టీచర్లుగా ఇలా చాలీచాలని జీతాలతో పని చేస్తూ మనోవేదనకు గురవుతున్నారు. ఏపీలో అక్కడి ప్రభుత్వం మినిమం టైంస్కేల్‌ను ఇచ్చేలా నాటి అభ్యర్థులకు న్యాయం చేస్తోందని, తెలంగాణలోనూ ఇదే తరహాలో తమను ఆదుకోవాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఫలిస్తున్న చొరవ.. పాలేరుకు జలకళ

కూసుమంచి : ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం చూపిన చొరవ సత్ఫలితాలనిస్తోంది. పాలేరు జలాశయానికి సాగర్ నీటి చేరిక మెరుగుపడింది. సాగర్ ఎడమ కాలువ మొదటి జోన్ నుంచి జిల్లా అవసరాలకు రావాల్సిన స్థాయిలో గత రెండు రోజులుగా పాలేరు జలాశయానికి నీరు చేరుతోంది. సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు చూపించిన చొరవతో అవసరాల మేరకు నీరందుతోంది. కొద్దిరోజుల క్రితం ఆందోళనకరంగా ఉన్న పరిస్థితి నుంచి జిల్లా రైతులకు ఉపశమనం కలుగనుంది. ఇదే పరిస్థితి కొన్నాళ్లు కొనసాగితేనే సాగులో ఉన్న పంటలు చేతికందే అవకాశం ఉంది.

ఆందోళన కలిగించిన ఇన్‌ఫ్లో

పాలేరు జలాశయానికి సాగర్ నీటి చేరిక కొద్ది రోజుల క్రితం కలవరపెట్టింది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు విడుదల చేస్తున్న నీటిలో నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో నీటిని ఇబ్బడిముబ్బడిగా వినియోగించుకోవడంతో జిల్లాకు అతితక్కువగా నీటి చేరిక సాగింది. జిల్లాలో సాగులో ఉన్న పంటలకు నీరందించేందుకు 5 వేల క్యూసెక్కులకుపైగా నీటి అవసరం ఉండగా సాగర్ ఎడమ కాలువ మొదటిజోన్ నుంచి 3,500 క్యూసెక్కుల నుంచి 4 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే చేరుతుండటంతో నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. పంటలకు నీరందించే

పరిస్థితి లేకపోవడంతో ప్రధానంగా సత్తుపల్లి నియోజకవర్గంలో పొలాలు బీటలు వారే పరిస్థితి ఏర్పడింది.

5,612 క్యూసెక్కులు రాక

ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రయత్నం ఫలించిన నేపథ్యంలో పాలేరు జలాశయానికి సాగర్ జలాశయం నుంచి ఇన్‌ఫ్లో పెరిగింది. గురువారం 5,612 క్యూసెక్కుల నీరు చేరాయి. అదే కొనసాగింది. అంతకు రెండు రోజుల ముందు 5 వేల క్యూసెక్కుల వరకు చేరాయి. పాలేరు జలాశయం నీటిమట్టం 15.80 అడుగులకు పడిపోగా.. నీటిమట్టాన్ని పెంచుతూ జిల్లా అవసరాలకు సరిపడా సరఫరా చేస్తున్నారు. గత రెండు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యం కూడా పాలేరు జలాశయంలో నీటిమట్టం పెరుగుదలకు దోహదపడుతోంది రెండో జోన్‌కు నీటి విడుదలను 2,800 క్యూసెక్కులకు తగ్గించిన అధికారులు కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు. దీంతో జలాశయం నీటిమట్టం గణనీయంగా పెరిగింది. 6 గంటలకు 19.50 అడుగులకు చేరింది.

# కొత్త మండలం.. సమస్యలు అనేకం

వరంగల్ : మారుమూల ప్రాంతాల అభివృద్ధికి, అటవీ గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు పలిమెలను నూతన మండలంగా ఏర్పాటు చేశారు. మండలం ఏర్పాటై ఆరేళ్లయినా అభివృద్ధి అంతంతే..! ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. బ్యాంకు సేవలు, విద్య, వైద్యం, సమాచార వ్యవస్థ మరెన్నో సదుపాయాలు అందుబాటులో లేవు.

బ్యాంకు సేవలు సుదూరంఅటవీ గ్రామాల ప్రజలు బ్యాంకు సేవలను పొందాలంటే పక్క మండలం మహదేవ్‌పూర్‌కి 32 కి.మీ వెళ్లాల్సిందే.. చివరగా ఉన్న ముకునూరు గ్రామస్థులు 52 కి.మీ వెళ్లాలి. మండలంలో తపాలా కార్యాలయాల ద్వారా డబ్బులు తీసుకొనే సౌకర్యం ఉన్నప్పటికీ రుణాలు, రైతు బంధు, పీ్మఎం కిసాన్ నిధి వంటి వాటిల్లో సమస్యలు వచ్చినపుడు బ్యాంకునకు వెళ్లక తప్పడం లేదు. పలిమెల నుంచి మహదేవ్‌పూర్‌కి వెళ్లే సరికి మధ్యాహ్నం అవుతుంది. పని ముగించుకొని ఇంటికి వచ్చేసరికి చీకటి అవుతోంది. పని కాలేదంటే.. మరో రోజు వెళ్లాలి. దీంతో సమయం వృథా కావడంతోపాటు ఆర్థికపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో బ్యాంకు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యాలయాలూ కరవే..

ఒక మండలం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ కార్యాలయాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. కానీ పలిమెలకు సంబంధించిన కార్యాలయాలు తహసీల్దారు, వ్యవసాయ, మండల పరిషత్ వంటి కార్యాలయాలు పాత మండలమైన మహదేవ్‌పూర్‌లోనే ఏర్పాటు చేసి అక్కడి నుంచే



పాలన కొనసాగిస్తున్నారు. మండల కేంద్రంలో సమీకృత భవనం నిర్మించినప్పటికీ సమావేశాలు, ముఖ్యమైన కార్యక్రమాలకు, ఉన్నతాధికారుల సందర్శన సమయాల్లోనే అధికారులు వస్తున్నారు.

విద్యపలిమెలలో ఒక్క ఉన్నత పాఠశాల కూడా లేకపోవడం గమన్హారం. మండలంలో మొత్తం ప్రాథమిక 11, ప్రాథమికోన్నత 2, మొత్తం 13 బడులు ఉండగా తొమ్మిది పాఠశాలలకు ఏకోపాధ్యాయులు ఉన్నారు. స్థానికంగా ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

వైద్యం మండలంలో ఆసుపత్రి లేక ప్రజలు వైద్యం కోసం మహదేవ్‌పూర్ ఏరియా ఆసుపత్రికి 32 కి.మీ దూరం వెళ్లాలి. ఆత్మహత్యలకు పాల్పడిన వారిని, పాముకాటుకు గురైన వారిని అంబులెన్స్ వచ్చి తీసుకుపోవడానికి గంట సమయం పడుతుంది. ఈ సమయంలో రోగుల పరిస్థితి విషమించడంతో పాటు పలువురు మృతి చెందిన సందర్భాలున్నాయి. మండలంలో ఆసుపత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

సిగ్నల్స్ అంతంతే..ప్రపంచం నూతన పరిజ్ఞానంతో 5జీతో ముందుకెళుంటే మండల ప్రజలకు మాత్రం మొబైల్ నెట్వర్క్ సిగ్నల్స్ అందుబాటులో లేవు. పంకెన, పలిమెల గ్రామాల్లోనే ఓ సంస్థకు చెందిన టవర్స్ ఉన్నాయి. లెంకలగడ్డ, మోదేడు, సర్వాయిపేట, ముకునూరు గ్రామాలకు పూర్తి స్థాయిలో సిగ్నల్స్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# తప్పని నీటి కష్టాలు

మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం ఆత్మనగర్ పరిధిలోని అందుబొందుల తండాలో నిర్మించిన ఉపరితల నీటి ట్యాంకు ఇది. ఇప్పటి వరకు ఈ ట్యాంకులోకి చుక్క భగీరథ నీరు రాలేదని స్థానికులు పేర్కొన్నారు. దీంతో స్థానికంగా బోర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇటీవల ఒక బోరు మరమ్మతులకు గురికాగా పంచాయతీ తరఫున బాగు చేయించి నీరందిస్తున్నారు. ఈ వేసవిలో భూగర్భజలాలు అడుగంటి బోర్లలో నీరు ఎండిపోతే తమ పరిస్థితి ఏమిటని తండావాసులు వాపోతున్నారు. ఇప్పటి వరకు భగీరథ నీరు రాని ట్యాంకులు మండలంలో ఇంకా కొన్ని ఉన్నాయి.

ఇంటింటికి శుద్ధజలం అందించాలన్న ప్రభుత్వ ఆశయం మెట్‌పల్లి మండలంలో నీరుగారిపోతోంది. నెల రోజులకు పైగా భగీరథ జలం సరఫరా కాకపోవడంతో గ్రామాల్లో కష్టాలు తప్పడం లేదు. వేసవి ప్రారంభం కావడంతో భగీరథ నీరు రాకపోతే పరిస్థితి మరింత తీవ్రతరమవుతుందని ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా మిషన్ భగీరథ ప్రధాన గ్రిడ్ నుంచి మండలంలో 23 పంచాయతీలకు నీరు సరఫరా చేయాల్సి ఉంది. భగీరథ నీటి సరఫరా ప్రారంభించినప్పటి నుంచి ఎప్పుడు ఏదో సమస్యతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మండలంలో నిర్మించిన కొన్ని ఉపరితల ట్యాంకులకు ఇప్పటికి చుక్క నీరు కూడా రాలేదు. కొన్ని గ్రామాలకు నీరు సరఫరా కాక పాత మంచినీటి పథకాలను యథావిధిగా వినియోగించాల్సి వస్తోంది. దీంతో పంచాయతీలకు ఆర్థిక భారమవుతోంది.

నెల గడిచినా..మెట్‌పల్లి మండలంలో పలు గ్రామాలు ఎత్తులో ఉండడంతో ట్యాంకులకు నీరు చేరడం లేదన్న అభిప్రాయముంది. దీంతో గతంలో వెల్లుల్ల వద్ద ఫ్లోకంట్రోల్ వాల్వ్‌ను కొద్దిగా మూసి గ్రామాలకు నీరు సరఫరా చేసేవారు. దీనివల్ల ప్రధాన పైపులైన్ లీకేజీలకు గురవుతుందని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అప్పట్నుంచి మెట్‌పల్లి మండలంలో 28 నివాస ప్రాంతాలకు భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో పంచాయతీలు పాత నీటి పథకాల ద్వారా గ్రామాల్లోని ప్రజలకు నీరందిస్తున్నారు. జలాల్‌పూర్ వద్ద అదనపు మోటారును నడిపించి మెట్‌పల్లి మండలంలోని గ్రామాలకు నీరు చేరేలా చూస్తామని అధికారులు నిర్ణయించారు. మధ్యలో ఒకట్రెండు రోజులు సరఫరా చేసినా మళ్లీ సమస్య తలెత్తడంతో యథాస్థితి ఏర్పడింది. భగీరథ నీరు సరఫరా కాక నెల రోజులకు పైబడి గడిచినా సమస్య పరిష్కారం కాకపోవడంతో అటు ప్రజాప్రతినిధులు, ఇటు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు

మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో నీటి సరఫరాకు తలెత్తిన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. జలాల్‌పూర్ వద్ద అదనపు మోటారు ప్రారంభించి ఒకట్రెండు రోజులు కొన్ని ప్రాంతాలకు సరఫరా చేశాం. మళ్లీ సమస్య తలెత్తి నిలిచిపోయింది. భగీరథ నీటిని ఒకట్రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో సరఫరా చేయడానికి అన్ని సిద్ధం చేస్తున్నాం.

ప్రేమ్‌కుమార్, డీఈఈవస్తాయని చెబుతున్నా రావట్లేదుగ్రామానికి భగీరథ నీరు సరఫరా కాక చాలా రోజులవుతుంది. పాత నీటి పథకాలతో నీరు సరఫరా చేస్తున్నాం. రూ.1.58 లక్షల వరకు విద్యుత్తు బిల్లు వచ్చింది. గ్రామ జనాభాకు అనుగుణంగా రెండుసార్లు ట్యాంకులను నింపాలి. పథకం ప్రారంభించినప్పట్నుంచి ఎప్పుడు పూర్తిస్థాయిలో నీరు రాలేదు. అధికారులను అడిగితే వస్తాయని చెబుతున్నారే తప్ప నీటిని సరఫరా చేయడం లేదు. వేసవి ప్రారంభం కావడంతో భగీరథ నీరు సరఫరా చేయకపోతే నీటి కష్టాలు తప్పవు.చౌట్‌పల్లి లావణ్య, ఆత్మకూర్ సర్పంచి




రాజమహేంద్రవరం: తెదేపా అధినేత చంద్రబాబు అరెస్ట్ కుట్రపూరితమనే విషయం అందరికీ తెలుసని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. న్యాయస్థానంలో కచ్చితంగా తమకు న్యాయం జరుగుతుందని చెప్పారు.

నారా భువనేశ్వరి, బ్రాహ్మణితో కలిసి రాజమహేంద్రవరం జైలులో చంద్రబాబుతో ఆయన ములాఖత్ అయ్యారు. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడారు.

**చంద్రబాబు మనో ధైర్యం కోల్పోలేదు :** "జైలులో చంద్రబాబు మనోధైర్యం కోల్పోలేదు. దేశ వ్యవసాయ రంగానికి ఎంతో సేవ చేసిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతికి సంతాపం తెలియజేయమని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ, మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. వైకాపా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని తెదేపా శ్రేణులను కోరారు. తెదేపాకు వస్తున్న ప్రజాదరణను అణచివేయాలని అధికార పార్టీ చూస్తోంది. కానీ దాని వల్ల మా పార్టీకి ఆదరణ పెరుగుతుంది తప్ప తగ్గదు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ వర్గమూ ఆనందంగా లేదు. రాజకీయ కక్షతోనే చంద్రబాబు అరెస్ట్ అనే విషయం అందరికీ తెలుసు.

**కావాలనే బురద చల్లుతున్నారు :** నా సొంత భూమి కూడా ఇన్నర్ రింగ్‌రోడ్డులో పోయింది. 2001లో ఈడుపుగల్లులో కొన్న 40 సెంట్ల సొంత స్థలం అది. దాని విలువ రూ.7 కోట్లు. సొంత భూమినే పోగొట్టుకున్న నేను.. అవినీతి చేస్తానా?కావాలనే బురద చల్లుతున్నారు. మాపై చేసే ఆరోపణల్లో నిజమేంటో కోర్టుల్లో తేలుతుంది. తెదేపా, జనసేన పార్టీ కమిటీలు ఇచ్చే నివేదిక ప్రకారం ఉమ్మడి కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతాం" అని నారాయణ చెప్పారు.




**తెదేపా అధినేత చంద్రబాబు త్వరగా విడుదలవ్వాలని భద్రాద్రి రామయ్య సన్నిధిలో తెదేపా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు కాలినడకన భద్రాచలం చేరుకుని స్వామివారికి పూజలు చేశారు. చంద్రబాబు అరెస్ట్‌ను ఖండిస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. సైకో పోవాలి.. సైకిల్ రావాలి అని నినాదాలు చేశారు.**

## సెప్టెంబర్ 30న 'మోత మోగిద్దాం!'.. వినూత్న నిరసనకు తెదేపా పిలుపు



అమరావతి: తెదేపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెదేపా సెప్టెంబర్ 30న వినూత్న నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. చంద్రబాబుకు మద్దతుగా శనివారం రాత్రి 7గంటల నుంచి రాత్రి 7.05 గంటల వరకు ఐదు నిమిషాల పాటు ప్రజలంతా సీఎం జగన్‌కు వినిపించేలా ఏదో ఒక రకంగా మోత మోగించాలని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. నియంత ముందు మొరపెట్టుకుంటే ఫలితం ఉండదని.. అధికార మత్తు వదిలేలా మోత మోగించాల్సిందేనంటూ ప్రత్యేక పోస్టర్‌ను పోస్ట్ చేశారు. ఐదు కోట్ల ఆంధ్రులంతా ఒక్కటిగా ఇంట్లోనో, ఆఫీస్‌లోనో ఇంకెక్కడ ఉన్నా సరే బయటకు వచ్చి గంట లేదా ప్లేట్ మీద గరిటెతో కొట్టాలని, రోడ్డుపై వాహనంతో ఉంటే హారన్ కొట్టాలని కోరారు. ఎవరు ఏ రూపంలో నిరసన తెలిపినా సంబంధిత వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. "అక్రమ అరెస్టు చేస్తే ప్రజాగ్రహం ఎలా ఉంటుందో చూపిద్దాం. తప్పుడు కేసులు బనాయిస్తే వెనక్కి తగ్గమని నిరూపిద్దాం. నిలువెత్తు నిజాయితీ రూపం, తెలుగు తేజం చంద్రబాబుకు మద్దతుగా తెలుగు వారంతా ఉన్నారని నిరూపించే తరుణమిది. నిష్కళంక రాజకీయ మేరునగధీరుడు చంద్రబాబు నాయుడుకు మద్దతుగా 30వ తేదీ శనివారం రాత్రి 7 గంటల నుంచి 7.05 నిమిషాలకు ఉన్న చోటే మోత మోగించి ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాశబ్దం వినిపిద్దాం" అని లోకేశ్ పిలుపునిచ్చారు.

## దొంగతనం చేసి సానుభూతి కోరుకుంటున్నారు: సజ్జల



అమరావతి: అడ్డంగా దొరికిన దోపిడీ దొంగల ముఠాకు ఎల్లో సపోర్ట్ చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎల్లో మీడియాకు వాస్తవాలతో సంబంధం లేదని, జనం నమ్మక చస్తారా అనేదే ఎల్లో మీడియా ఆలోచన అంటూ దుయ్యబట్టారు. "వీరంతా తోడు దొంగలే.. ఇంతకంటే పెద్ద పదం లేదు. లక్ష మంది గోబెల్స్ కలిస్తే ఒక చంద్రబాబు.. అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఇష్టానుసారం దోచుకున్నారు. టీడీపీ అంటే తోడు దొంగల పార్టీ. ముఠా నాయకుడు చంద్రబాబును కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారు. స్కాం దర్యాప్తులో ప్రభుత్వ ప్రమేయం లేదు. ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో ఉంది. ఈ 20 రోజుల్లో లోకేశ్ ముఠా నానా యాగీ చేసింది. ప్రజలకు సంబంధించిన సొమ్ము దోపిడీకి గురైంది" అని సజ్జల పేర్కొన్నారు. "సాక్ష్యాధారాలతో దొరికితే కోర్టు రిమాండ్‌కు పంపింది. జరిగిన స్కామ్‌పై వీరంతా మాట్లాడటం లేదు. దొంగతనం చేసి సానుభూతి కోరుకుంటున్నారు. మేధావులు అనుకుంటున్న కొందరితో స్టేట్‌మెంట్లు ఇప్పిస్తున్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను దేశ సమస్యలా చిత్రీకరిస్తున్నారు" అంటూ సజ్జల రామకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు.

## పొలిటికల్ ఎంట్రీ ఇస్తారనుకుంటున్న తరుణంలో బ్రాహ్మణి ఆసక్తికర ట్వీట్..




అమరావతి : ఇతర రాష్ట్రాల అభివృద్ధి అజెండాగా ఏపీ ప్రభుత్వం ఎందుకు పనిచేస్తోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సతీమణి బ్రాహ్మణి ట్విటర్ వేదికగా జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ అక్రమ కేసులో నారా చంద్రబాబు అరెస్ట్, తర్వాత నారా లోకేష్‌ని కూడా అరెస్ట్ చేయబోతున్నారనే ప్రచారం నేపథ్యంలో రాజకీయాల్లోకి బ్రాహ్మణి ఎంట్రీపై ఊహాగానాలు వెలువడుతున్న తరుణంలో ఆమె ఆసక్తికర ట్వీట్ చేశారు. పరిశ్రమలు తరలిపోవడంపై ఏపీ ప్రభుత్వాన్ని ట్విటర్ వేదికగా నిలదీశారు. సులభతర వ్యాపారం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలిపి అందరూ గర్వపడేలా చేశారన్నారు. ఇప్పుడు అమర్ రాజా నుంచి లులు వరకూ ఎన్నో పరిశ్రమలు ఏపీ నుంచి తెలంగాణకు తరలిపోయాయన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులు 'పుష్ అవుట్, పుల్ ఇన్' సూత్రంలో భాగంగా ఏపీ నుంచి తరిమివేయబడి తెలంగాణకు లాక్కోబడుతున్న కారణాల ఆంతర్యం ఏమిటి? అని ప్రశ్నించారు. లులు, అమర్‌రాజ లాంటి కంపెనీలు రాష్ట్రం నుంచి తరలిపోవడంపై 'ది ప్రింట్' వెబ్‌సైట్‌లో వచ్చిన కథనాన్ని తన ట్వీట్‌కు బ్రాహ్మణి జత చేశారు.




## ట్రూడో అనుకున్నదొకటి.. అయ్యిందొకటి: నిజ్జర్ ఊసెత్తని అమెరికా..!

నిజ్జర్ హత్య విషయంలో ఓ పక్క అమెరికా మద్దతు మాకే అని కెనడా చెబుతున్నా.. ఆ విషయంపై బహిరంగంగా మాట్లాడేందుకు వాషింగ్టన్ ఇష్టపడటంలేదు. తాజాగా భారత విదేశాంగ మంత్రి జైశంకర్.. అమెరికా విదేశంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాల్లో కీలక అంశాలపై చర్చించారు. కెనడాతో దౌత్యవివాదం తలెత్తిన తర్వాత ఇరు దేశాల మధ్య జరిగిన ఉన్నతస్థాయి సమావేశం ఇదే కావడంతో ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ భేటీపై జైశంకర్ ట్వీట్ చేశారు. "నా మిత్రుడు, అమెరికా విదేశాంగశాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో భేటీ కావడం సంతోషంగా ఉంది. విస్తృత స్థాయి అంశాలు, అంతర్జాతీయ పరిణామాలపై చర్చించాం. త్వరలో జరగబోయే 2o2 భేటీకి సంబంధించిన అంశాలపై చర్చించాం" అని ఎక్స్ (ట్విటర్)లో పేర్కొన్నారు. అమెరికా విదేశాంగశాఖ ప్రధాన కార్యాలయంలో ఈ భేటీ జరిగింది.

మరోవైపు ఈ సమావేశంపై అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ మాట్లాడుతూ "జీ20కి భారత్ నేతృత్వంలో లభించిన ఫలితాలు, ఇండియా-మిడిల్‌ఈస్ట్-యూరోప్ కారిడార్, అత్యున్నత శ్రేణి మౌలిక వసతులపై పెట్టుబడులు వంటి అంశాలను మాట్లాడుకొన్నారు. భవిష్యత్తులో జరగబోయే 2o2 భేటీ కోసం ఇరు దేశాల మధ్య ముఖ్యంగా రక్షణ, స్పేస్, క్లీన్ ఎనర్జీ రంగాల్లో సమన్వయం కొనసాగడం అవసరమని బలంగా విశ్వసిస్తున్నారు" అని వెల్లడించారు. ఇరు దేశాల మంత్రుల భేటీ అనంతరం ఈ ప్రకటన వెలువడింది. 2o2 భేటీ తేదీలను మాత్రం వెల్లడించలేదు. సాధారణంగా ఏటా ఈ సమావేశం నవంబర్ తొలి అర్ధ భాగంలో జరుగుతుంది. ఈ సమావేశాల్లో ఇరు దేశాల విదేశాంగ, రక్షణశాఖ మంత్రులు పాల్గొంటారు.

**నిజ్జర్‌పై నోరు మెదపని బ్లింకెన్..! :** భారత్-అమెరికా విదేశాంగ మంత్రులు.. నిజ్జర్ హ్యవహారంపై గుంభనంగా వ్యవహరించారు. ఈ విషయం చర్చకు వచ్చిందా.. రాలేదా అనే విషయం కూడా వెల్లడించలేదు. దీనిపై అడిగిన ప్రశ్నలకు జవాబు ఇచ్చేందుకు అమెరికా మంత్రి ఆంటోనీ బ్లింకెన్ నిరాకరించారు. "నా మిత్రుడు, సహచరుడు జైశంకర్‌ను విదేశాంగశాఖ ప్రధాన కార్యాలయానికి ఆహ్వానించడం సంతోషంగా ఉంది. జీ20, ఐరాస జనరల్ అసెంబ్లీ వంటి చాలా అంశాలపై చర్చలు జరిగాయి" అని వెల్లడించారు. స్టేట్ డిపార్ట్‌మెంట్ ట్రీటీ రూమ్‌లో జరిగిన ఫొటో సెషన్‌లో ఇరు దేశాల మంత్రులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ.. జీ20 సదస్సుకు సహకరించినందుకు అమెరికాకు ధన్యవాదాలు తెలిపారు. నిజ్జర్ హత్యపై అమెరికన్లు తమతోనే ఉన్నారని కెనడా ప్రధాని ట్రూడో ఓ పక్క ప్రకటించారు. కానీ, ఈ భేటీపై ప్రకటన సమయంలో ఆ ప్రస్తావనే లేకపోవడం గమనార్హం.

**నిజ్జర్ విషయంలో అమెరికన్లు మాతోనే : జస్టిన్ ట్రూడో...** అంతకు ముందు జైశంకర్ అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాక్ సలీవాన్‌తో శ్వేత సౌధంలో భేటీ అయ్యారు.

ఈ సమావేశంలో ఇరు దేశాల బంధాన్ని ముందుకు తీసుకెళ్లడంపై చర్చించినట్లు జైశంకర్ ట్విటర్‌లో పేర్కొన్నారు. ఈ భేటీ అనంతరం అమెరికాలోని థింక్ ట్యాంక్ బృందాల సభ్యులతో, అమెరికా ట్రేడ్ ప్రతినిధి కేథరిన్ తాయ్‌తో భేటీ అయ్యారు.





బెంగళూరు: కర్ణాటక ప్రభుత్వం పొరుగున ఉన్న తమిళనాడుకు కావేరీ నీటిని విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ కన్నడ, రైతు సంఘాలు పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్ శుక్రవారం ఉద్ధృతంగా కొనసాగుతోంది. బంద్‌కు మద్దతుగా హోటళ్లు, విద్యా, వ్యాపార సంస్థలు మూతబడ్డాయి. ట్యాక్సీలు, ఆటోలు కూడా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. యాప్ ఆధారిత ట్యాక్సీ సేవలు కూడా పనిచేయట్లేదు. దీంతో కర్ణాటక స్తంభించింది. అటు, బంద్ ప్రభావం విమాన రాకపోకలపైనా పడింది. బెంగళూరు విమానాశ్రయంలో ఈ ఉదయం 44 విమాన సర్వీసులు రద్దయ్యాయి. బంద్ నేపథ్యంలో చాలా మంది ప్రయాణికులు తమ టికెట్లను క్యాన్సిల్ చేసుకోవడంతో ఈ విమాన సర్వీసులను రద్దు చేసినట్లు తెలుస్తోంది.

**ఆందోళనలు.. అరెస్టులు..** కర్ణాటక రక్షణ వేదికె, జయ కర్ణాటక సంఘం, ఇతర కన్నడ సంఘాలు, రైతు సంఘం, హసిరుసేన, చెరకు సాగుదారుల సంఘం, ట్యాక్సీ- ఆటోరిక్షా సంఘాలు, కర్ణాటక చలన చిత్ర వాణిజ్య మండలి, సినిమా కళాకారుల సంఘం తదితర వందకు పైగా సంస్థలు ఈ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఉదయం ఆరు నుంచే బంద్ మొదలైంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలుచోట్ల ఆందోళనకారులు నిరసన చేపట్టారు. మైసూరులో బస్టాంట్ ఎదుట రైతు సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. దీంతో బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చిక్కమంగళూరులో కొందరు ఆందోళనకారులు పెట్రోల్‌బంక్‌లోకి దూసుకొచ్చి బలవంతంగా మూసివేయించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటివరకు 50 మందికి పైగా ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బంద్ దృష్ట్యా శుక్రవారం అర్ధరాత్రి వరకు రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పలు చోట్ల సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించారు. ప్రభుత్వ కార్యాలయాలు, కేఆర్ఎస్ ఆనకట్ట, పర్యాటక, చారిత్రక కట్టడాల వద్ద ప్రభుత్వం భద్రతను పెంచింది. అటు తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. తమిళనాడు వెళ్లే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. గురువారం రాత్రి 10 గంటల తర్వాత తమిళనాడుకు వెళ్లే కేఎస్ఆర్టీసీ బస్సులను ముందు జాగ్రత్త చర్యగా శుక్రవారం అర్ధరాత్రి వరకు నిలిపివేశారు. మరోవైపు కన్నడ సంఘాలకు వ్యతిరేకంగా తమిళనాడులోనూ కొన్ని చోట్ల ఆందోళనలు కొనసాగుతున్నాయి.

**బెంగళూరు బంద్‌తో రూ.1500కోట్ల నష్టం..** కావేరీ జలాల విడుదలపై గత మంగళవారం బెంగళూరులో బంద్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ బంద్ కారణంగా రాష్ట్ర ఖజానాకు రూ.1000-1500కోట్ల నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఇప్పుడు రోజుల వ్యవధిలోనే మరోసారి బంద్ చేపట్టడం.. భారీ నష్టానికి దారితీస్తుందని పరిశ్రమలు, ఉద్యోగుల సంఘాలు వెల్లడించాయి.




**విశాఖపట్నం రాజధాని అనే మాట అభాసుపాలైందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. వైకాపా పాలనలో మద్యం మాఫియా, భూదందాలకు విశాఖ అడ్డాగా మారిపోయిందని మండిపడ్డారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో విశాఖలో బెట్టింగ్, గంజాయి దందాలు పరాకాష్ఠకు చేరాయని, ఈ ముఠాలను కాపాడటం కోసం విజయవాడ కేంద్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఒక అనామకుడి దగ్గర రూ.350 కోట్లు దొరికాయంటే.. పరిస్థితి ఏటో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ఘటనలపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ ద్వారా విచారణ చేయాలని ఆయన కోరారు.**




భవానీపురం : అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీతో జరిగిన భేటీ వివరాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వెల్లడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. "అది వ్యక్తిగత భేటీనా? లేక వ్యవస్థీకృత భేటీనా? గతంలో కూడా ఆహ్వాన పత్రిక ఇచ్చే పేరుతో అదానీ జగన్‌తో 4 గంటలపాటు భేటీ అయ్యారు. ఏపీలో ఇప్పటికే గంగవరం, కృష్ణపట్నం పోర్టులను, సోలార్ విద్యుత్ ఒప్పందాలను అదానీ కంపెనీకే అప్పగించారు. ఏపీలో స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లు కూడా అత్యంత భారీ ధరకు అదానీకే కట్టబెట్టారు. జగన్, అదానీల రహస్య భేటీ వెనుక మర్మమేంటి?" అని రామకృష్ణ ప్రశ్నించారు. గురువారం రాత్రి తాడేపల్లిలోని సీఎం నివాసంలో జగన్‌తో గౌతమ్ అదానీ భేటీ అయ్యారు. పలు కీలక అంశాలపై ఆయన జగన్‌తో చర్చించినట్లు తెలుస్తోంది. భేటీ వివరాలను ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంఓ) వెల్లడించలేదు. అదానీ రాక, సీఎంతో భేటీ అంతటినీ రహస్యంగా ఉంచింది. సాధారణంగా ఎవరైనా ముఖ్యులు సీఎంతో భేటీ అయినప్పుడు ఆ వివరాలను మీడియాకు వెల్లడించే సీఎంఓ, ఇప్పుడు సమాచారాన్ని బయటకు పొక్కనివ్వలేదు.

# కాజల్ అగర్వాల్ స్పైసీ ట్రీట్..

టాలీవుడ్ చందమామగా సినిమా ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్టార్ ఇమేజ్ ను సంపాదించుకున్న బ్యూటీ కాజల్ అగర్వాల్. అమ్మడు పెళ్లి చేసుకున్న తర్వాత కూడా అదే అందంతో కుర్రాళ్లను మంత్రముగ్ధులను చేస్తోంది. అలాగే ఓ బిడ్డకు తల్లి అయిన తర్వాత కూడా ఆమె ఇంకా పాతికేళ్ల హీరోయిన్ తరహాలోనే చాలా అందంగా కనిపిస్తోంది. ఇక ఎలాంటి ఫోటోలు పోస్ట్ చేసినా కూడా సోషల్ మీడియాలో ట్రెండింగ్ లిస్టులో చేరాల్సిందే. నేటి తరం యువ హీరోయిన్స్ కు ఏ మాత్రం తీసుకోకుండా కాజల్ అగర్వాల్ గ్లామర్ ట్రీట్ తో అయితే కుర్రాళ్లను ఎంతగానో అట్రాక్ట్ అయితే చేస్తోంది. ఇక సోషల్ మీడియాలో ఈ బ్యూటీ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక రీసెంట్ గా కాజల్ అగర్వాల్ పోస్ట్ చేసిన మరికొన్ని ఫోటోలు ఇంటర్నెట్లో హీటెక్కిస్తున్నాయి. కొన్ని నెలల క్రితం తీసిన ఫొటోలను షేర్ చేసుకున్న కాజల్ తాజా ఫోటోగ్రాఫ్లో తన అభిమానులను స్టన్ అయ్యేలా చేసింది. ఆమె బటన్స్ లేకుండా ఉ



న్నట్లు బ్లూ కలర్ బ్లేజర్ ప్యాంట్లో తన చేతులతో టాప్ని పట్టుకుని పోజులిచ్చింది. అమ్మడు ఎక్కడా కూడా ఓవర్ డోస్ లేకుండా చాలా తెలివిగా తన గ్లామర్ తో అయితే మంత్రముగ్ధులను చేస్తోంది. కాజల్ గతంలో కూడా ఎన్నో గ్లామర్స్ ఫోటోలను పోస్ట్ చేసింది. కానీ ఈ లుక్స్ లో మాత్రం ఆమె మరింత అందంగా ఉంది అంటూ ఫాలోవర్స్ పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. ఇక కాజల్ అగర్వాల్ ఇటీవల కాలంలో తన ఫాలోవర్స్ సంఖ్యను కూడా అమితంగా పెంచేసుకుంటుంది. ఇక ఈ బ్యూటీ సినిమాల విషయానికి వస్తే నందమూరి బాలకృష్ణ నటిస్తున్న భగవంత్ కేసరి సినిమాలో ఆయనకు మొదటిసారి జోడిగా కాజల్ కనిపించబోతోంది. ఆ సినిమాలో ఆమె పాత్ర చాలా విభిన్నంగా ఉండబోతుందట. అలాగే ఆ సినిమాలో శ్రీ లీల కూడా ఆమెతో స్క్రీన్ షేర్ చేసుకోబోతోంది. అలాగే కాజల్ అగర్వాల్ కమల్ హాసన్ శంకర్ కాంబినేషన్లో తెరపైకి రాబోతున్న ఇండియన్ 2 లో కూడా నటిస్తోంది. ఈ సినిమాపై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక మరోవైపు తమిళ్ ఇండస్ట్రీలో కూడా ఒక సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీలైనంతవరకు ఇప్పుడు మంచి కంటెంట్ ఉన్న పాత్రలు చేయాలి అని కాజల్ జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. మరి రాబోయే సినిమాలలో ఆమె ఏ విధంగా కనిపిస్తుందో చూడాలి.

# మణిరత్నం కథానాయిక అవ్వాలని నటినయ్యా!-అదితీరావ్ హైదరీ

భారతీయ సినిమా అనే పవర్ హౌస్ లో భాగమైనందుకు థ్రిల్లింగ్ గా గర్వంగా ఉందని అందాల కథానాయిక అదితీరావ్ హైదరీ అన్నారు. "నేను మణిరత్నం కథానాయికను కావాలనుకున్నాను. అందుకే ..నటిని అయ్యాను" అని కూడా తెలిపారు. ప్రయోగాలు చేస్తూ భాషతో సంబంధం లేకుండా వైవిధ్యమైన పాత్రలను పోషించేందుకు ఆసక్తిగా ఉంటానని తెలిపారు. "నేను ఎప్పుడూ సినిమాని హిందీ తమిళం అని చూడలేదు. నా దృష్టిలో ఏదైనా అద్భుతమైన దర్శకుల కథనం మాత్రమే. ఎవరైనా నటీనటులు సరైన సమయంలో సరైన స్థలంలో ఉన్నట్లయితే అద్భుతమైన దర్శకుల దృష్టిలో



భాగం అవుతారు. మణి సర్ తో నేను చేసిన సినిమా నా జీవితాన్ని అన్ని విధాలుగా మార్చేసింది" అని చెప్పింది. ఆన్ స్క్రీన్ ఇమేజ్ కి దశలు ఉన్నాయని చెప్పిన అదితీరావ్... పనిని ఎంచుకునే విధానంలో ఒక ప్రక్రియ ఉంటుందని తెలిపింది. ముందుగా దర్శకులను ఎంపిక చేసుకుంటాను. స్క్రిప్ట్ ను నాకు ఆఫర్ చేసిన పాత్రను చూస్తాను. అన్నీ కుదిరితే ఆ పాత్రను ఎంపిక చేసుకుంటాను. నేను ఎంపికల విషయంలో జానర్ లేదా భాషని చూడను. ఎంచుకునే దర్శకుడు.. కథను అనుసరించి దశలవారీగా ముందుకు వెళతామని కొంతవరకూ టైప్ కాస్టింగ్ జరుగుతుందని నేను నమ్ముతున్నాను. దర్శకులు తారల్ని ఒక నిర్దిష్ట మార్గంలో చూస్తారు. ఎక్కువ మంది అలా చూడాలనుకుంటున్నారు లేదా ఎక్కువ మంది దర్శకులు అలా ఉపయోగించుకోవచ్చని భావిస్తాను. ఇది అంత చెడ్డ విషయం అని నేను అనుకోను... అని అదితీ తెలిపారు.




# రికార్డ్ ధరకి ఎన్టీఆర్ దేవర డిజిటల్ రైట్స్!




జూనియర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా మూవీ దేవర. సుమారు 300 కోట్ల వరకు ఈ సినిమాపై ఖర్చు చేస్తున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. సైఫ్ అలీఖాన్ పవర్ ఫుల్ ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. మూవీ షూటింగ్ శరవేగంగా సాగుతోంది. నవంబర్ ఆఖరుకి దేవర సినిమా షూటింగ్ కంప్లీట్ చేయాలనే ఆలోచనతో కొరటాల శివ ఉన్నారు. దానికి తగ్గట్లుగానే గ్యాప్ లేకుండా షెడ్యూల్స్ ప్లాన్ చేసుకుంటున్నాడు. హై వోల్టేజ్ యాక్షన్ ప్యాక్డ్ మూవీగా చిత్రాన్ని సిల్వర్ స్క్రీన్ పై కొరటాల శివ ఆవిష్కరించే పనిలో ఉన్నారు. హాలీవుడ్ స్టంట్ మాస్టర్స్ సైతం ఈ సినిమాకి వర్క్ చేయడం విశేషం. ఇదిలా ఉంటే ఏప్రిల్ 5న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఐదు ఇండియన్ భాషలలో రిలీజ్ చేయడానికి రెడీ అవుతున్నారు. ఇప్పటికే డేట్ కన్ఫర్మ్ చేసేశారు. తాజాగా ఈ సినిమాకి సంబంధించి మరో ఇంటరెస్టింగ్ న్యూస్ తెరపైకి వచ్చింది. దేవర మూవీ ఓటీటీ డీల్ క్లోజ్ అయిపోయింది. ప్రముఖ ఓటీటీ స్ట్రీమింగ్ కంపెనీ నెట్ ఫ్లిక్స్ దేవర మూవీ డిజిటల్ రైట్స్ ని అన్ని భాషలకి సంబంధించి సొంతం చేసుకుంది. ఏకంగా 150 కోట్లకి ఈ హక్కులు దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అంటే దేవర మూవీ షూటింగ్ కంప్లీట్ కాకుండా పెట్టిన పెట్టుబడిలో 50 శాతం రికవరీ అయ్యిందని చెప్పొచ్చు. ఈ మధ్యకాలంలో పెద్ద సినిమాలకి ఓటీటీ కంపెనీల నుంచి అదిరిపోయే ఆఫర్స్ డిజిటల్ హక్కుల కోసం వస్తున్నాయి. అందుకే స్టార్స్ తో సినిమాలు చేసే నిర్మాతలు భారీ బడ్జెట్ తో మూవీస్ చేస్తోన్న కూడా సేఫ్ జోన్ లో ఉంటున్నారు. ఆర్ఆర్ఆర్ తర్వాత జూనియర్ ఎన్టీఆర్ లాంగ్ గ్యాప్ తీసుకొని చేస్తోన్న మూవీ దేవర. ఈ కారణంగానే సినిమాపై భారీ హైప్ ఉంది. నెక్స్ట్ హిందీలో వార్ 2 సినిమాలో హృతిక్ రోషన్ తో కలిసి నటుస్తున్నాడు. ఈ సినిమా ద్వారా నార్త్ ఇండియన్ ఆడియన్స్ కి కూడా తారక్ బలంగా చేరువ అయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఆ సినిమా తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రాజెక్ట్ పట్టాలు ఎక్కనుంది.

# యువరాణి రూపానికి మతి భ్రమించాలంతే!



NTR 30 చిత్రంతో టాలీవుడ్ లో అడుగు పెడుతోంది కపూర్ కాంపౌండ్ యువరాణి జాన్వీ. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలి రాకతో తెలుగు లోగిళ్లు పునీతం కాబోతున్నాయంటూ అభిమానులు ఎంతో ఎగ్జయిట్ అవుతున్నారు. సోషల్ మీడియాల్లో జాన్వీకి వెల్ కం చెబుతూ తారక్ ఫ్యాన్స్ లవ్ హార్ట్ ఈమోజీలను షేర్ చేస్తున్నారు. ఆరంగేట్రమే యంగ్ యమ ఎన్టీఆర్ సరసన జాక్ పాట్ పట్టేసిందంటూ పొగిడేస్తున్నారు.

జాన్వీ బాలీవుడ్ నుంచి టాలీవుడ్ లో అడుగుపెట్టే క్రమంలో ఫోటోషూట్ల పరంగా మరింత దూకుడు పెంచింది. ఓవైపు హాట్ కంటెంట్ ని తనదైన శైలిలో ప్రెజెంట్ చేస్తూనే ట్రెడిషనల్ అవతార్ లో కనిపించేందుకు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇటీవల సౌత్ అభిమానులను దృష్టిలో ఉంచుకుని ఫోటోషూట్ల తీరుతెన్నులను మార్చేయడం గమనార్హం. కొద్ది కాలంగా జాన్వీ కపూర్ వరుస ఫోటోషూట్లు అంతర్జాలంలో సునామీని సృష్టిస్తున్నాయి. తాజాగా ఈ బ్యూటీ బంగారు తళుకుల ఫ్రాకులో ఎంతో అందంగా కనిపిస్తోంది. లేటెస్ట్ డిజైనర్ థై స్లిట్ ఫ్రాక్ లో జాన్వీ మునుపటి కంటే హాట్ గా కనిపిస్తోందంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. ముఖ్యంగా తారక్ అభిమానులు జాన్వీ కపూర్ ఫోటోలను వైరల్ గా షేర్ చేస్తూ యువరాణి అంటూ తమ ప్రేమను కురిపిస్తున్నారు. ఆర్.ఆర్.ఆర్ లాంటి పాన్ ఇండియా హిట్ అందుకున్న తర్వాత యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన అవకాశం దక్కించుకున్న జాన్వీ నిజంగా అదృష్టవంతురాలు అంటూ కీర్తించేస్తున్నారు. బంగారు వర్ణం లాంగ్ ఫ్రాక్ లో జాన్వీ తళుకుబెళుకులు గుండెల్ని గుల్ల చేస్తున్నాయంటూ ఒక సెక్షన్ ఫ్యాన్స్ ప్రేమలో పడిపోయారు. ఓవరాల్ గా జాన్వీ గోల్డెన్ లుక్ ఫ్యాన్స్ గుండెల్లో బలమైన ముద్ర వేసిందనడంలో సందేహం లేదు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ తన కెరీర్ 30వ సినిమాతో ల్యాండ్ మార్క్ హిట్ అందుకోవాలని తపిస్తున్నాడు. కొరటాల శివ దర్శకుడు కావడంతో ఈ మూవీ కోసం పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతున్నాడు. ఇలాంటి క్రేజీ ప్రాజెక్ట్ లో జాన్వీ కథానాయికగా అవకాశం అందుకుంది. ఈ సినిమాతో జాన్వీ పేరు దేశ విదేశాల్లో మార్మోగడం ఖాయమని విశ్లేషిస్తున్నారు. సరైన టైమ్ లో సరైన ప్రాజెక్ట్ తో జాన్వీ సౌత్ లో అడుగుపెడుతుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జాన్వీ ఇటీవల ఎన్టీఆర్ 30 లాంచ్ ఈవెంట్ లో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సరసన నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని... టీమ్ సృష్టిస్తున్న ప్రపంచం ప్రేక్షకులను చాలా ఎగ్జయిట్ చేస్తుందని కితాబిచ్చింది. ఇటీవలే RRR సినిమాని మళ్లీ చూశానని అపారమైన చరిష్మా ఉన్న ఎన్టీఆర్ తో కలిసి నటించడం గొప్ప అవకాశమని దీనిని సద్వినియోగం చేసుకుంటానని జాన్వీ పేర్కొంది.

# అనసూయ గ్లామర్ ట్రీట్.. నెవ్వర్ బిఫోర్ స్టిల్!

హాట్ అండ్ బోల్డ్ యాంకర్ అనగానే ముందుగా వినిపించే పేరు అనసూయ. ఈ బ్యూటీకి పరిచయం అవసరం లేదు. బుల్లితెరకు అందాన్ని తీసుకువచ్చింది. అనసూయకి ముందు కూడా చాలా మంది యాంకర్లు ఉన్నారు. కానీ యాంకరింగ్ కి గ్లామర్ సొగసులు అద్దింది మాత్రం అనసూయ అని నిర్మోహమాటంగా చెప్పొచ్చు. యాంకరింగ్ తో తన కెరీర్ ని మొదలుపెట్టిన ఆమె ఇప్పుడు వెండి తెరపై అవకాశాలను అందుకుంటూ ముందుకు దూసుకుపోతోంది.కాగా అనసూయ సోషల్ మీడియాలోనూ ఎప్పుడూ చురుకుగా ఉంటుంది. ముఖ్యంగా ట్రెండీ దుస్తుల్లో మెరుస్తూ ఫోటోలను షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తూ ఉంటుంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో గ్లామర్ ఒలకపోయడానికి ఎప్పుడూ వెనకాడదు. అందుకే తాజాగా మరోసారి తనలోని గ్లామర్ డాల్ ని బయటకు తీసింది. ఈ సారి క్లీవేజ్ షో తోపాటు థైస్ షో కూడా చేస్తూ అలరించింది. బ్లాక్ కలర్ లో మరింత అందంగా మెరుస్తోంది. అయితే ఈ డ్రెస్ లో ఆమె బ్రా



ధరించకపోవడం విశేషం. ఇక థైస్ దగ్గర కూడా నెట్టెడ్ లాంటి ప్యాంట్ ధరించింది. అందులో ఆమె స్కిన్ క్లియర్ గా కనపడుతుండటం విశేషం. అనసూయ పిక్స్ చూసిన ఫ్యాన్స్ నెటిజన్లు ఫిదా అవుతున్నారు. లైక్స్ కామెంట్లతో వైరల్ చేస్తున్నారు. ఆమె అందాన్ని ఫ్యాషన్ సెన్స్ ను పొగుడుతూ ఆకాశానికి ఎత్తుతున్నారు. ఇదిలా ఉండగా అనసూయ ఎప్పుడూ తన ఫోటోలను మాత్రమే కాదు తన ఫ్యామిలీ ఫోటోలను కూడా షేర్ చేస్తూ ఉంటుంది. ఇటీవల ఫ్యామిలీతో కలిసి వెకేషన్ కి వెళ్లిన ఫోటోలను కూడా ఆమె షేర్ చేశారు. ఆ సమయంలో ఆమె బికినీ ట్రీట్ కూడా ఇవ్వడం విశేషం. అనసూయను పొగిడేవారు ఎంత మంది ఉన్నారో విమర్శించే వారు కూడా అంతే ఉంటారు. అయితే ఎవరు ఎంతలా విమర్శించినా ఆమె మాత్రం తన పని తాను చేసుకుంటూ ముందుకు దూసుకుపోతోంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం అనసూయ పుష్ప2 లో నటిస్తున్నారు. మొదటి భాగంలోనూ ఆమె కీలక పాత్ర పోషించారు. ఇక ఆమె నటించిన విమానం సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ మూవీలో అనసూయ నటనకు ప్రశంసలు దక్కాయి.

# ఐదు ఫ్లాపులు అయినా తగ్గని అమ్మడి క్రేజ్..!

బుట్ట బొమ్మ పూజా హెగ్డేని మళ్లీ బ్యాడ్ లక్ వెంటాడుతుంది. అమ్మడు చేసిన గత ఐదు సినిమాలు నిరాశపరచాయి. అందులో తెలుగు తమిళ సినిమాలు మూడు ఉండగా హిందీ సినిమాలు రెండు ఉన్నాయి. ప్రభాస్ తో రాధే శ్యాం సినిమా భారీ అంచనాలతో వచ్చి ఫ్లాప్ అయ్యింది. ఇక ఆ తర్వాత విజయ్ బీస్ట్ ఆశించిన స్థాయిలో అంచనాలను అందుకోలేదు. ఇక ఆ తర్వాత బాలీవుడ్ లో చేసిన సర్కస్ చరణ్ తో చేసిన ఆచార్య సినిమాలు విఫలమయ్యాయి. ఇక లేటెస్ట్ గా బాలీవుడ్ లో సల్మాన్ తో చేసిన కిసి కా భాయ్ కిసి కి జాన్ సినిమా కూడా అమ్మడికి నిరాశ మిగిల్చింది. బాలీవుడ్ లో హిట్ మేనియా కొనసాగించాలని చూస్తున్న పూజా హెగ్డే కలని కలగానే మిగిలింది. ఐదు ఫ్లాపులు ఉన్నా సరే అమ్మడి క్రేజ్ మాత్రం ఎక్కడ తగ్గట్లేదని చెప్పొచ్చు. ప్రస్తుతం త్రివిక్రమ్ మహేష్ కాంబో సినిమాలో పూజా నటిస్తుంది. ఇదే కాకుండా మరో స్టార్ హీరో సినిమాలో కూడా పూజా బేబీ ఛాన్స్ అందుకుందట. స్టార్ సినిమాల్లో ఫలితాలతో



సంబంధం లేకుండా అమ్మడు ఛాన్స్ లు అందుకుంటుంది. కెరీర్ మొదట్లో కూడా పూజా హెగ్డేకి మొదట ఫ్లాపులే పలకరించాయి. కానీ అల్లు అర్జున్ దువ్వాడ జగన్నాథం సినిమాతో అమ్మడి రేంజ్ మారిపోయింది. అంతకుముందు గ్లామర్ షో విషయంలో ఆలోచించిన పూజా డీజేలో తన గ్లామర్ షోకే ప్రేక్షకులు పడిపోయారన్న రీజన్ తో అమ్మడు వరుస సినిమాల్లో గ్లామర్ షో చేస్తూ వస్తుంది. పూజా థై షోకి సెపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అమ్మడు సినిమాలో ఉంది అంటే తొడల అందాల ప్రదర్శన చాలా కామన్ అనిపించేలా చేసింది. ఆ గ్లామర్ షో వల్లే అమ్మడికి సినిమాల రిజల్ట్ తో తేడా లేకుండా ఛాన్స్ లు వస్తున్నాయి. ఏది ఏమైనా ఒకటి రెండు ఫ్లాపులు పడితేనే అడ్రస్ లేకుండా పోతున్న హీరోయిన్స్ ఉండగా పూజా హెగ్డే మాత్రం హిట్లు వస్తున్నా మళ్లీ అవకాశాలను మాత్రం అందుకుంటూ ఫాం కొనసాగిస్తుంది. మహేష్ 28వ సినిమా హిట్ అయితే అమ్మడు మళ్లీ తిరిగి ఫాం లోకి వచ్చినట్టే.



# రాష్ట్రానికి మరో భారీ పెట్టుబడి

## 16,650 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్న అడ్వెంట్ ఇంటర్నేషనల్.. మంత్రి కేటీఆర్ హర్షం

హైదరాబాద్: పరిశ్రమ ఏదైనా పెట్టుబడులకు డెస్టినేషన్‌గా తెలంగాణ మారుతున్నది. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి జాతీయ అంతర్జాతీయ కంపెనీలు క్యూకడుతున్నాయి. తాజాగా గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అయిన అడ్వెంట్ ఇంటర్నేషనల్ రాష్ట్రంలో రూ.16,650 కోట్ల పెట్టుబడి పెట్టడానికి ముందుకువచ్చింది. ఈ మేరకు కంపెనీ ఎండీ పంకజ్ పట్వారీ, సంస్థ ప్రతినిధులు హైదరాబాద్‌లో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సంస్థ విస్తరణ, పెట్టుబడి కార్యకలాపాలను కేటీఆర్‌కు వివరించారు. ఈనేపథ్యంలో సంస్థ పెట్టుండిపై మంత్రి కేటీఆర్ సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఆర్ అండ్ డీ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఇది ఫార్మా, లైఫ్ సైఫ్‌సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్ వృద్ధికి సంకేమని చెప్పారు. అడ్వెంట్ ఇంటర్నేషనల్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలుగా సహకరిస్తామని వెల్లడించారు.

# గుండె సమస్యలకు కారణమవుతున్న బీపీ: మంత్రి హరీశ్ రావు




హైదరాబాద్: ఒకప్పుడు కమ్యూనికబుల్ వ్యాధులు ఎక్కువగా ఉంటే ఇప్పుడు నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ అధికమవుతున్నాయని మంత్రి హరీశ్ రావు అన్నారు. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కనీస వ్యాయామం చేయకపోవడం, చెడు అలవాట్లు, మానసిక ఒత్తిళ్లు వంటివి దీనికి కారణమని చెప్పారు. ఇటీవల నిర్వహించిన ఓ సర్వే ప్రకారం రాష్ట్రంలో 24 శాతం షుగర్, 14 శాతం బీపీ కేసులు ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ప్రభుత్వం బీపీ, షుగర్ మందులను ఉచితంగా అందిస్తున్నదని వెల్లడించారు. హైదరాబాద్‌లోని దుర్గంచెరువు వద్ద కార్డియాలజిస్ట్ సొసైటీ తెలంగాణ స్టేట్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో వరల్డ్ హార్ట్ డే కార్యక్రమంలో మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే బీపీ, షుగర్‌లను గుర్తించి చికిత్స తీసుకోకపోవడం వల్ల దీర్ఘకాలిక రోగాలకు కారణం అవుతున్నాయన్నారు. వాటివల్ల గుండె, కిడ్నీలు, కాలేయం వంటి ముఖ్యమైన అవయవాలు దెబ్బతింటున్నాయని చెప్పారు. ఎక్కువగా గుండె సమస్యలకు బీపీ ఒక కారణం అవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారని వెల్లడించారు. సడెన్ కార్డియాక్ అరెస్ట్ వల్ల దేశంలో ఏటా సుమారు 15 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. సమయం, సందర్భం, చిన్నా, పెద్దా అనే తేడాలేకుండా ఎవరికైనా సడెన్ కార్డిక్ అరెస్ట్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అయితే సకాలంలో సీపీఆర్ చేయడం వల్ల వీరి ప్రాణాలు కాపాడటం సాధ్యం అవుతుందన్నారు. జిమ్ చేస్తూ, పనులు చేస్తూ, డ్యాన్స్ చేస్తూ, నడుస్తూ కొంత మంది అకస్మాత్తుగా పడిపోవడం, ప్రాణాలు కోల్పోవడం వంటివి మనం తరచూ చూస్తున్నామని అన్నారు. ఆ సమయంలో సీపీఆర్ తెలిసిన వారు ఉంటే వారి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని వెల్లడించారు. అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడే అతి ముఖ్యమైన సీపీఆర్ విధానం గురించి మన దేశంలో 98 శాతం మందికి తెలియదన్నారు. ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని, శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారని వెల్లడించారు. ఇందులో భాగంగా, పారామెడికల్ సిబ్బందితోపాటు వైద్య, మున్సిపల్ సిబ్బంది, పోలీసు, కమ్యూనిటీ వాలంటీర్లు, ఉద్యోగులు, రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ల ప్రతినిధులు, సిబ్బంది, కమర్షియల్ కాంప్లెక్స్ వర్కర్స్ ఇలా వివిధ వర్గాలకు చెందిన వ్యక్తులకు సీపీఆర్ మీద శిక్షణ ఇచ్చామన్నారు. దీనికోసం అవసరమైన 1262 ఏఈడీ మిషన్లు సమకూర్చుకుని అన్ని సీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానల్లో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీల్లో కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ప్రతిఒక్కరు బీపీ, షుగర్ బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. బాడీ మాస్ ఇండెక్స్‌ని పరిమితిలో ఉంచుకోవాలన్నారు. బీపీ, షుగర్ నియంత్రణలో ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, రోజుకు కొంత సమయం వ్యాయామం, ధ్యానం చేసేందుకు కేటాయించాలని చెప్పారు. ఒత్తిడికి లోనుకాకుండా ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. అందరం ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్య తెలంగాణ, ఆరోగ్య భారత్ సాధ్యమవుతుందని చెప్పారు. కాగా, గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలపై ప్రచారం కల్పించేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఏటా ఈరోజు వరల్డ్ హార్ట్ డేగా నిర్వహిస్తుంటారని, ఈ సారి Use Heart, Know Heart అనే థీమ్‌తో నిర్వహించుకుంటున్నామన్నారు.

# టీఎస్‌పీఎస్‌ను దొరల ప్రగతి భవన్ సర్వీస్ కమిషన్‌గా మార్చారు



హైదరాబాద్: టీఎస్‌పీఎస్ తీరుపై వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల నిప్పులు చెరిగారు. ఈ మేరకు ఆమె ట్విట్టర్‌లో ధ్వజమెత్తారు. "30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో టీఎస్‌పీఎస్ ఆటలాడుతుందనేది నిన్న కమీషన్ ఇచ్చిన వివరణే ఒక నిదర్శనం. గ్రూప్ 1 పరీక్షలు ఎంత మంది రాశారో ముందొక లెక్కట. ఓఎంఆర్ షీట్స్ లెక్కిస్తే మరో లెక్కట. ఇది చాలా కామన్ అట. అర్హత లేనోళ్లకు.. దొర అడుగులకు మడుగులు ఒత్తేటోళ్లకు పదవులు కట్టబెడితే కామన్ కాక మరేంటి?, ఇప్పటిదాకా ఏ సర్కారు పరీక్షలే పెట్టనట్లు.. ఎవరూ ఉద్యోగాలే ఇవ్వనట్లు కమీషన్ కాకమ్మ కథలు చెబుతున్నది. ప్రశ్నాపత్రాలనే అంగట్లో సరుకుల్లా అమ్ముకున్నోళ్లకు ఓఎంఆర్ షీట్స్ తారుమారుచేయడం ఒక లెక్కనా?, నిజంగా బోర్డు పారదర్శకత పాటిస్తే పేపర్లు బయటకు ఎందుకు వచ్చినట్లు?, ఓ సారి పరీక్ష రద్దైన తర్వాత మరోసారి ఎందుకు జాగ్రత్తలు తీసుకోనట్లు?, బయోమెట్రిక్ విధానం అమలు చేస్తే కమీషన్ కి వచ్చిన నష్టం ఏంటి?, అన్యాయం జరిగిందని కోర్టు మెట్లు ఎక్కితే.. పెట్టిన పరీక్షలే న్యాయస్థానం రద్దు చేసిందంటే.. %ఖ్రూాజ% పారదర్శకత ఏంటో అర్థమైంది. రెండు సార్లు పరీక్షలు రాసినా ఫలితం లేకపాయెనే అని కన్నీళ్లు పెట్టుకుంటున్న 2.33 లక్షల నిరుద్యోగుల గోస ఈ సర్కారుకు తగలకపోదు. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ను కాస్త.. దొరలు ప్రగతి భవన్ సర్వీస్ కమీషన్ గా మార్చారు. నచ్చినోళ్లకు పదవులు, కావాల్సినోళ్లకు ఉద్యోగాలు ఇదే దొర తెచ్చిన బంగారు తెలంగాణ." అంటూ షర్మిల ట్వీట్ చేశారు.

# రాష్ట్రంలో ప్రతిపక్షాలకు చోటు లేదు : మంత్రి కొప్పుల

జగిత్యాల : గతంలో ఎన్నడూ జరుగనంత అభివృద్ధి నేడు తెలంగాణలో జరుగుతున్నదని, రాష్ట్రంలో ప్రతిపక్షాలకు చోటు లేదని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ధర్మపురి నియోజకవర్గం పెగడపల్లి మండలం దోమలకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బండారి సతీష్, మొదటి వార్డు మెంబర్ నాగుల కుమార్, పుప్పాల సురేష్, దేశెట్టి మల్లారెడ్డి ఎల్లెంకి శ్రీనివాస్, పార్టీ కార్యకర్తలు శుక్రవారం కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్యారంటీ పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్నారు. అయితే



వారు అధికారంలో వస్తారనే గ్యారంటీ లేదన్నారు. సాగుకు మూడు గంటల కరెంట్ చాలన్న పార్టీ అవసరమా అనే విషయాన్ని ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.




హైదరాబాద్: నగరంలో గణేశ్ నిమజ్జనాలు కొనసాగుతున్నాయి. హుస్సేన్ సాగర్‌లో ఉదయం 6 గంటల వరకు 19,870 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు. ఎల్బీనగర్ జోన్‌లో 3,150, ఖైరతాబాద్ జోన్‌లో 2,059 చార్మినార్ జోన్‌లో 983, కూకట్‌పల్లి జోన్‌లో 4,581, శేరిలింగంపల్లి జోన్‌లో 5,934 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు వెల్లడించారు. ఈ సాయంత్రం వరకు నిమజ్జన ప్రక్రియ కొనసాగనున్నట్లు తెలిపారు.

**ట్యాంక్‌బండ్‌పై మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ ఆంక్షలు** : మరోవైపు సాగర్ చుట్టుపక్కల ఇంకా వందలాది విగ్రహాలు నిమజ్జనం కోసం బారులుతీరాయి. తెలుగుతల్లి ఫ్లైఓవర్ నుంచి ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్ బండ్ వైపుగా విగ్రహాల వాహనాలను పోలీసులు మళ్లిస్తున్నారు. నగరంలోని చాలా ప్రాంతాల నుంచి అర్ధరాత్రి తర్వాత విగ్రహాలను నిమజ్జనం కోసం తీసుకురావడంతో ఉదయం పెద్దసంఖ్యలో విగ్రహాలు సాగరంవైపు కదిలాయి.

దీంతో హుస్సేన్ సాగర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇంకా నిమజ్జన సందడి కొనసాగుతూనే ఉంది. సచివాలయంతోపాటు ట్యాంక్‌బండ్ చుట్టుపక్కల రహదారులపై పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు.

మరోవైపు సాధారణ వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ట్యాంక్ బండ్ చుట్టుపక్కల ట్రాఫిక్ ఆంక్షలు ఈ సాయంత్రం వరకు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.




# దీక్షిత్ రెడ్డి హత్య కేసులో మహబూబాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు

మహబూబాబాద్ : జిల్లాలో మూడేళ్ల క్రితం జరిగిన కుసుమ దీక్షిత్ రెడ్డి అనే బాలుడి హత్య కేసులో మహబూబాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పునిచ్చింది. నిందితుడు మంద సాగర్‌కు మరణశిక్ష విధించింది. కోర్టు తీర్పుపై దీక్షిత్ రెడ్డి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయ దేవత, పోలీసుల చిత్రపటాలకు వారు పాలాభిషేకం చేశారు.వివరాల్లోకి వెళ్తే..మహబూబాబాద్ జిల్లాలో 2020 అక్టోబర్‌లో జర్నలిస్ట్ కుసుమ వసంత, రంజిత్ రెడ్డి దంపతుల కుమారుడు దీక్షిత్ రెడ్డి హత్యకు గురయ్యాడు. స్థానికంగా పంచర్ షాప్ నిర్వహించే మంద సాగర్ అనే వ్యక్తి ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దాంతో నిందితుడిని అరెస్ట్ చేసి వరంగల్ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసు విచారణ పూర్తి కావడంతో తాజాగా మహబూబాబాద్ జిల్లా కోర్టు నిందితుడికి మరణశిక్ష విధిస్తున్నట్లు సంచలన తీర్పునిచ్చింది. మూడేళ్ల క్రితం ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన మందసాగర్.. కేసముద్రం మండలం అన్నారం గ్రామ శివారులోని దానమయ్య గుట్టపై హత్యచేసి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఆ తర్వాత అదే రోజు రాత్రి దీక్షిత్ రెడ్డి తండ్రి రంజిత్ రెడ్డికి ఇంటర్నెట్ ద్వారా ఫోన్ చేసి రూ.45 లక్షలు డిమాండ్ చేశాడు. రంజిత్ రెడ్డి ఫిర్యాదుతో కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు మూడు రోజుల తర్వాత దానమయ్య గుట్టపై దీక్షిత్ మృతదేహాన్ని కనిపెట్టారు. నిందితుడు మంద సాగర్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు.

# కాంగ్రెస్ ఓట్ల కోసం గ్యారెంటీలు ప్రకటించింది

నారాయణపేట: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అంటూ ప్రజలను మోసం చేస్తోందని.. ఓట్ల కోసం మాత్రమే ఆ పార్టీ గ్యారెంటీలు ప్రకటించిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ వ్యాఖ్యానించారు. అక్టోబర్ 1వ తేదీన మహబూబ్‌నగర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభ నేపథ్యంలో శుక్రవారం నాడు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీకే అరుణ హాజరయ్యారు. ఈసందర్భంగా అరుణ మీడియాతో మాట్లాడుతూ..."అక్టోబర్ ఒకటిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహబూబ్‌నగర్‌లో కాచిగూడ నుంచి కృష్ణ వరకు నూతన రైలును ప్రారంభిస్తారు. హెచ్‌పీ(%ఎూ%) గ్యాస్ పైపులైన్ ప్రారంభిస్తారు. జాతీయ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేస్తారు.

జిల్లాలో మొత్తం 13 వేల 5 వందల కోట్ల రూపాయల పనులకు శంకుస్థాపన చేస్తారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేసింది. రాబోయే ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో అధికారంలోకి వస్తే మక్తల్ నారాయణపేటకు జూరాల నుంచి సాగునీరు అందిస్తాం. కేంద్రంలో మోదీ ఆధ్వర్యంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, రాష్ట్రంలో కూడా బీజేపీ



అధికారంలోకి వస్తోంది. వికారాబాద్ కృష్ణ వరకు రైలు మార్గం పొడిగిస్తాం. నారాయణపేట యాదగిరి హైవే రోడ్డు మంజూరుకు కృషి చేస్తాం. పాలమూరు రంగారెడ్డి పథకంలో కేవలం ఒక మోటారు మాత్రమే ప్రారంభించి మొత్తం ప్రాజెక్టు పూర్తి చేసినట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం అబద్ధాలు చెపుతోంది. పాలమూరు రంగరెడ్డి ఎత్తిపోతల పథకంలో డిజైన్‌లు మార్చి ఖర్చులు పెంచి సీఎం కేసీఆర్ కమీషన్లు తీసుకున్నారు. మోదీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావాలి" అని డీకే అరుణ పేర్కొన్నారు.

# సీడీఎఫ్ నిధులు విడుదల చేయడం లేదంటూ పిటిషన్




హైదరాబాద్ : నియోజకవర్గాల అభివృద్ధి నిధుల మంజూరులో ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఎమ్మెల్యే సీతక్క పిటిషన్ వేశారు. ములుగు నియోజకవర్గానికి సీడీఎఫ్ నిధులు విడుదల చేయడం లేదని సీతక్క పిటిషన్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నందున తన నియోజకవర్గానికి నిధులు ఇవ్వడం లేదన్నారు. సీడీఎఫ్ మంజూరులో జిల్లా మంత్రి ప్రమేయం చట్ట విరుద్ధమని సీతక్క పేర్కొన్నారు. జిల్లా మంత్రి ఆమోదంతో నిధులు మంజూరు చేయాలన్న జీవో 12 కొట్టేయాలన్నారు. వెంటనే నిధులు విడుదలకు ఆదేశించాలని న్యాయవాది కృష్ణ కుమార్ గౌడ్ కోరారు. ఎమ్మెల్యే సీతక్క పిటిషన్ పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను అక్టోబరు 9కి వాయిదా వేసింది.

# బీఆర్ఎస్ పాలన దేశానికే ఆదర్శం : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

ఆదిలాబాద్ : దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన సాగుతుందని, దేశానికి ఆదర్శంగా తెలంగాణ నిలుస్తుందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం కౌటాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనిది తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ అందిస్తుందన్నారు. రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కు తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోడు రైతులకు పట్టాలు ఇచ్చి ఆదుకున్నారు. రైతుబంధు, రైతు బీమా పథకాలు అమలుచేస్తూ రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం కౌటాల మండలంలోని గుండాయిపేట గ్రామ సమీపంలో 75 కోట్లతో అంతరాష్ట్ర వంతెన నిర్మాణానికి నిధులు



మంజూరు చేశామన్నారు. విద్యుత్ సమస్యను పరిష్కరించే విధంగా చింతలమానపల్లి మండలంలో 33/11కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి 57 కొట్లు మంజూరు అయ్యాయని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com